17వ వసంతంలోకి
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
సోమవారం | 1 జులై 2024 | పేజీలు 10

## శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఈఓగా ఎన్‌విఎస్‌ఎన్.మూర్తి బాధ్యతలు స్వీకరణ

**శ్రీకాళహస్తి. మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంనకు తిరుపతి దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆర్‌జెసిని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంనకు నూతన ఈఓ యన్.వి.ఎస్.ఎన్.మూర్తి దేవస్థానం ఆలయ కార్య నిర్వణ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీమేధా గురు దక్షిణామూర్తి స్వామి సన్నిధానం వద్ద ఆలయ డిఈఓ ఏకాంబరం నూతన ఈఓ ఎన్‌విఎస్‌ఎన్. మూర్తిని శేషవస్త్రంతో సత్కరించి జ్ఞాన ప్రసూ నాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. వేద పండితులు వేదమంత్రాలతో ప్రత్యేకంగా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డి.ఇఓ ఏకాంబరం,అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున్ ప్రసాద్, ఏఈఓ సతీష్ మల్లి, టెంపుల్ సూపర్డెంట్, సి.ఎస్.ఓ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, పి.ఆర్.ఓ నాగభూషణం నాయక్,రవి ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# పండుగలా సామాజిక పింఛన్ పంపిణీ

**జిల్లాలో 2,69,162 మందికి రూ.182.33 కోట్లు**

**సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దకే పంపిణీ**

**జిల్లా కలెక్టర్ ధ్యాన చంద్ర**



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ఎన్‌టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్‌లను జిల్లాలో పండుగ వాతా వరణంలో పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పెన్షన్ ల మొత్తాన్ని కేటగిరీల వారీగా పెంచి జూలై 1న లబ్ధిదారుల ఇంటి వద్దకే పంపిణీ చేయలసినదిగా నిర్ణయించిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సామాజిక భద్రత పెన్షన్‌ల పెంపు హామీ అమలులో భాగంగా మొదటి కేటగిరి లోని వృద్దాప్య, వితంతు, ఒంటరి మహిళ తదితర వర్గాల వారికి పెన్షన్ లను ప్రభుత్వం పెంచిందన్నారు. ఇందులో 11 కేటగిరీలకు చెందిన వారి ఫించను సొమ్మును రూ.3వేల నుండి రూ.4వేలకు పెంచిన నేపథ్యంలో జూలై 1వ తేదీన రూ.4వేలతో పాటు ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబందించి పెరిగిన ఫించను సొమ్ము నెలకు రూ.1,000ల చొప్పున మూడు మాసాల అరియర్స్ కలుపుకుని మొత్తం రూ.7వేలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రెండవ కేటగిరీలోని పాక్షిక దివ్యాంగులకు రూ.3వేల నుండి రూ.6వేలకు, మూడో కేటగిరీలోని పూర్తి స్థాయి దివ్యాంగులకు రూ.5 వేల నుండి రూ.15 వేలకు, నాలుగవ కేట గిరీలోని కిడ్నీ, తల సేమియా వంటి దీరకాలిక వ్యాధులతో బాధపడేవారికి రూ.5వేల నుండి రూ.10వేలకు పెంచిన ఫించను సొమ్ము పంపిణీ ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 2,69,162 మందికి రూ.182.33 కోట్లు ఎన్టీఆర్ భరోసా - సామాజిక భద్రత పెన్షన్‌ల కింద జూలై 1న పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 6గంటల నుండి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో

మిగతా 2లో

### పండుగ వాతావరణంలో

# ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీ

**జిల్లాలో 2,71,696 మందికి రూ.181 కోట్లు పెన్షన్‌ల పంపిణీ**

**సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దకే పంపిణీ చేరుస్తాం**

**జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**



**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంతో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్‌లను జిల్లా లో పండుగవాతావరణంలో పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పెన్షన్‌ల మొత్తాన్ని వర్గాల వారీగా పెంచి జూలై 1న లబ్ధిదారుల ఇంటి వద్దకే పంపిణీ చేయలసినదిగా నిర్ణయించిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సామాజిక భద్రత పెన్షన్‌ల పెంపు హామీ అమలులో మొదటి కేటగిరిలోని వృద్దాప్య, వితంతు, ఒంటరి మహిళ తదితర వర్గాల వారికి పెన్షన్‌లను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని ఇందులో 11 కేటగిరీలకు చెందిన వారి ఫించను సొమ్మును రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచిన నేపథ్యంలో జూలై 1న రూ.4 వేలతో పాటు ఏప్రిల్, మే జూన్ మాసాలకు సంబందించి పెరిగిన ఫించను సొమ్ము నెలకు రూ.1,000ల చొప్పున మూడు మాసాల అరియర్స్ కలుపుకుని మొత్తం రూ.7,000లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రెండవ కేటగిరీలోని పాక్షిక దివ్యాంగులకు రూ.3వేల

మిగతా 2లో

### ప్రజా సమస్యల పరిష్కారానికే

# మొదటి ప్రాధాన్యత

**నగరంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మార్నింగ్ వాక్**

**సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలి**

**ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్**

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 31, 32 డివిజన్లకు చెందిన వీధుల్లో పర్యటించి ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజాసమస్యలను అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ఎమ్మెల్యే, కమిషనర్ డా. జె.అరుణ, నగరపాలక అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి 31, 32 వార్డుల పరిధిలో క్షేత్ర

మిగతా 2లో



# పరిశుద్ధమైన తాగునీరు అందించటమే ప్రభుత్వ లక్ష్యం

8లో

**సూపర్ సిక్స్ పథకాలతో అమలుకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే పులివర్తి నాని**

**నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం**



# నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహణ..!

**పట్టించుకోని అధికారులు...**

**పిల్లల జీవితాలతో ఆడుకుంటున్న శాంతినికేతన్ స్కూల్ యాజమాన్యం**

**మాజీ మంత్రి పెద్దిరెడ్డికి సంబంధించిన పిఎల్‌ఆర్ ప్రాజెక్ట్స్ పేరుపైన ఉన్న కారులో పిల్లలను తరలిస్తున్న స్కూల్ యాజమాన్యం**

**రామకుప్పం, మేజర్‌న్యూస్:** మండలం పరిధిలో ఓ ప్రైవేట్ స్కూల్ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేస్తున్నారు అంటూ మండల ప్రజలు 15 రోజుల క్రితం ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోలేదు. ప్రభుత్వా నుంచి ఏలాంటి అనుమతి లేకుండా సొంత వాహనాల్లో పిల్లలను తరలిస్తున్నారు. కారు చూస్తే మాజీ మంత్రి పెద్దిరెడ్డికి సంబంధించిన పిఎల్‌ఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరు పైన ఉన్న కారు. ఒక షాపింగ్ కాంప్లెక్స్ లాగా బిల్డింగ్‌ని నిర్మించుకొని కేవలం 16సెంట్లులోనే స్కూల్‌ను నడుపుతున్న యాజమాన్యం పట్టించుకోని అధికారులు. పిల్లలకు ఎలాంటి భద్రత లేదు కనీసం పిల్లలకు సరిగా బాత్రూంలు లేవు, స్కూల్‌కి ప్రహరీగోడ లేదు. పిల్లలు ఆడుకోవడానికి ఆటస్థలం కూడా కల్పించని స్కూల్ యాజమాన్యం అలాంటి పాఠశాలపై తక్షణమే చర్యలు తీసుకొని విద్యార్థిని విద్యార్థులకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరారు. ఎంఈఓ మహబూబ్ బాషాను వివరణ కోరగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పాఠశాలపై తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.



## నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** సోమవారం చిత్తూరు కలెక్టరేట్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను ఉ.10గం.ల నుండి మ.1 గం.వరకు కలెక్టరేట్ లోని నూతన సమావేశపు మందిరం నందు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

## నరేంద్ర మోడీ మన్ కీ బాత్‌లో శ్రీకాళహస్తి బీజేపీ నేతలు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి బిజెపి పార్టీ కార్యాలయంలో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్. బిజెపి శ్రేణులు వీక్షించారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ దేశంలో అక్కడక్కడ ఉన్న కళాకారుల గురించి అదే విధంగా అరకు కాఫీ తోటల గురించి ప్రధాని నరేంద్ర మోడీ ప్రస్తావించడం గొప్ప పరిణామం ఈ మంకీ బాత్ కార్యక్రమంలో మరింత ఉత్తేజంగా కళాకారులు కుటీర పరిశ్రమ చేసే వ్యక్తులు మరింత కృషితో రాణిస్తారని తెలియ జేశారు. బిజెపి సీనియర్ నాయకుడు అమర్నాథ్ మాట్లాడుతూ మంకీ బాత్ 111వ సంచికలో ప్రధాని నరేంద్ర మోది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అరకు ప్రాంతంలో అక్కడ పండుతున్న కాఫీ తోటల ప్రత్యేకతలు ఆయన ప్రస్తావించడం ఆంధ్రుడుగా ఆనందం వ్యక్తం చేస్తున్నానన్నారు.



## వకుళ మాతకు బంగారు పూత కవచాలు బహుకరణ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** పేరూరు బండపై వెలసిన వకుళ మాత అమ్మవారికి బంగారు పూత పూసిన కవచాలు బహుకరించారు. ఈ మేరకు ఆదివారం తిరుపతి రూరల్ మండలం పాతకాల్వకు చెందిన ఉంగరాల సుబ్రహ్మణ్యం అనే భక్తుడు రూ.1.24 లక్షల విలువైన బంగారు పూత పూసిన కవచాలను వకుళమాత అమ్మవారికి విరాళంగా అందించారు.ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మికి ఆలయంలో దాత ఈ కవచాలను బహుకరించారు.



## కళా సంపదను భావితరాలకు అందించాలి

### రిటైర్డ్ డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ పిలుపు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** అంతరించిపోతున్న కళలను పరిరక్షించి ఆ కళా సంపదను భావితరాలకు అందించి తద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని టీటీడీ రిటైర్డ్ డెప్యూటీ ఈవో చిన్నంగారి రమణ పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సుబ్బరాజు నాట్య కళా పరిషత్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఏకపాత్రాభినయ పోటీలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. రెండు రోజుల పాటు చేపట్టిన ఈ పోటీలకు రాష్ట్రంతో పాటు రాష్ట్రేతర ప్రాంతాల నుంచి సుమారు 100 మందికి పైగా కళాకారులు పాల్గొని రామాయణ, మహాభారత ఇతిహాసాలలో ప్రముఖ పాత్రలను తమదైన హావ భావాలతో, గాంభీర కంఠధ్వనితో అద్భుతంగా అభినయించి మెప్పించారు. ఈ సందర్భంగా నటనారంగంలో రాణిస్తూ కళామతల్లికి సేవలందిస్తున్న ఐదురుగు కళాకారులకు ఎన్టీఆర్ శత జయంతి పురస్కారాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. పోటీలు ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రధానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. గత 40 ఏళ్లకుపైగా నాటక కళ వికాసానికి కోనేటి సుబ్బరాజు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కళలను, కళాకారులను ప్రోత్సహించాలనే సంకల్పంతో జాతీయ స్థాయిలో ఏకపాత్రాభినయ పోటీలు చేపట్టడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ఏకపాత్రాభినయ పోటీలలో అత్యంత ప్రతిభాకనబరిచి గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు. అలాగే ఏడుమందికి ప్రోత్సాహక బహుమతులు ప్రధానం చేశారు. కాగా చివరి రోజైన ఆదివారం సాయంత్రం. కళాకారులు ప్రదర్శించిన బూడిద సాంఘిక నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. మానవ జీవనంలో సాగే ఆశా, నిరాశల సంఘర్షణను ఆవిష్కరిస్తూ అద్భుత నటనతో కళాకారులు ప్రేక్షకుల్లో ఆలోచనలను రేకెత్తించారు. ఈ కార్యక్రమంలో రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, ప్రముఖ కళాకారులు, కళాపోషకులు బీఎస్, రావు, రవీంద్ర, వెంకటరమణ, రఘురామశర్మ, రాధాకృష్ణ, ఆమూరి సుబ్రమణ్యం, సుబ్బరాజు నాట్య కళాపరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు, చంద్రబాబు, విజయకుమార్, వెంకటస్వామి, కళాకారులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యత

(మొదటిపేజీ తరువాయి)

పర్యటన నిర్వహించారు. ఆర్టీసీ డిపో రోడ్డు, బి క్రాస్, టెలిఫోన్ కాలనీలో మురుగునీటి కాలువలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగునీటి కాలువల్లో పూడిక పూర్తిస్థాయి తొలగించాలని, ప్రజలు ఫిర్యాదు చేసిన ప్రాంతాల్లో కాలువల వెడల్పు, మరమ్మతులు పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఈ–క్రాస్‌లో 32వ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎఫ్ క్రాస్, వినాయకుని గుడి వీధి, రామ్ నగర్, రామ్ నగర్ ఎక్స్టెన్షన్ ప్రాంతాల్లో పర్యటించారు. మురుగునీటి కాలువల్లో లెవలింగ్ అడ్జస్ట్ చేయడం ద్వారా మురుగు నీరు నిలవకుండా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాడైన కల్వర్టులను మరమ్మతు చేయాలని ఆదేశించారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఆర్వో గోపాలకృష్ణ వర్మ, డీఈ రమణ, శానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నయ్య, వార్డు కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.



### పండుగ వాతావరణంలో

## ఎన్టీఆర్ భరోసా కింద ఫించన్ల పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

నుండి రూ.6 వేలకు, మూడో కేటగిరీలోని పూర్తి స్థాయి దివ్యాంగులకు రూ.5 వేల నుండి రూ.15 వేలకు నాలుగవ కేటగిరీలోని కిడ్నీ, తలసేమియా వంటి దీరకాలిక వ్యాధులతో బాధపడేవారికి రూ.5 వేల నుండి 10 వేలకు పెంచిన ఫించను సొమ్ము పంపిణీ ఉంటుందన్నారు.జులై 1న ఉదయం 6గంటల నుండి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో ఫించనుదార్ల ఇంటి వద్దే ఫించను సొమ్మును పంపిణీ చేస్తామని, అవసరం మేరకు ఇతర శాఖ ఉద్యోగులను వినియోగించడం జరుగుతుందని, ఒక్కొక్క ఉద్యోగి ద్వారా 50 గృహాల చొప్పున ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. సాధ్యమైనంత మేర ఒకే రోజు ఈ ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరుగుతుందని, అనివార్య కారణాల వల్ల ఇంకా ఎవరన్నా మిగిలిపోయి ఉంటే రెండో రోజు కూడా ఈ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

### పండుగలా

## సామాజిక పింఛన్ పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

ఫించనుదార్ల ఇంటి వద్దే ఫించను సొమ్మును పంపిణీ చేస్తామని, అవసరం మేరకు ఇతర శాఖ ఉద్యోగులను వినియోగించడం జరుగుతుందని, ఒక్కొక్క ఉద్యోగి ద్వారా 50 గృహాల చొప్పున ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. సాధ్యమైనంత మేర ఒకే రోజు ఈ ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరుగుతుందని, అనివార్య కారణాల వల్ల ఇంకా ఎవరన్నా మిగిలిపోయి ఉంటే రెండో రోజు కూడా పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## పెన్షన్ల పండగ సువర్ణాక్షరాలతో లికించబడుతుంది

### బీసీ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అవ్వ,తాతలు ఆరోగ్యంగా సంతోషంగా ఉండడానికి, వితంతు ఒంటరి మహిళలకు ఆసరాగా చెప్పిన మాట ప్రకారం రూ.3వేల పెన్షన్ 4000 రూపాయలు గాను, దివ్యాంగులకు 3000 రూపాయల నుండి 6000 రూపాయలు గాను, తీవ్ర అనారోగ్యంతో బాధపడే వారికి 5000 రూపాయల నుండి పదివేల రూపాయలుగా, ట్రాన్స్ జెండర్లు,గీత కార్మికులు, మత్స్య కార వర్గాలకు 4000 రూపాయలు గాను ఎన్టీఆర్ భరోసా పేరుతో రేపు ఉదయం 6 గంటలకే పెన్షన్ ఇవ్వడం చాలా సంతోషకరమని అది ఒక చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని ఈ యొక్క కార్యక్రమాన్ని సువర్ణ అక్షరాలతో లిక్కించబడుతుందని కన్నావరం హరిబాబు పత్రికా ముఖంగా తెలిపారు. గత చేతకాని పాలన లాగా ఇచ్చిన మాట తప్పి, విడతల వారీగా పెంచటం కాకుండా ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచి ఇవ్వటమే కాక,ఇచ్చిన హామీ ప్రకారం గత మూడు నెలల నుంచి పెంచిన పెన్షన్‌తో కలిపి 7 వేలు పంపిణీ. దేశ చరిత్రలో సంచలనం. స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో పెన్షన్లను స్వయంగా లబ్ధిదారులకు అందజేయనున్నారని తెలిపారు.



## వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

### భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన పులివర్తి నాని ఎమ్మెల్యే

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** చిన్నగొట్టిగల్లు మండలం ఆంజనేయస్వామి వారి దేవాలయంలో అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. చిన్న గొట్టిగల్లు మండల నాయకులు, కార్యకర్తలు ఆహ్వాన మేరకు... చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని వీరాంజనేయ స్వామివారి ఆలయానికి చేరుకున్నారు. మంగళ వాయిద్యాలతో పులివర్తి నాని మండల నాయకులు శాలువా కప్పి గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. యువత టపాకాయలు కాలుస్తూ... మహిళలు హారతుల తో స్వాగతం పలికారు. గ్రామస్తులతో కలసి ఆలయపూజారి పులివర్తి నానిని పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. భక్తిశ్రద్ధల తో ప్రత్యక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే వెంట చిన్న గొట్టిగల్లు ఉమ్మడి మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు ఉన్నారు. ఆలయ పూజారి స్వామివారి తీర్థప్రసాదాలను పులివర్తి నానికి అందజేశారు.



## నారా భువనేశ్వరిని కలిసిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్

**వి.కోట, మేజర్‌న్యూస్:** వి.కోట మండలానికి చెందిన తెలుగుదేశం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్ర నాయుడు ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెరిటేజ్ డైరెక్టర్ నారా భువనేశ్వరిని కలిసి పలమనేరు నియోజకవర్గంలో హెరిటేజ్ ఉత్పత్తులపై చర్చించి పలమనేరు నియోజకవర్గంలో కొన్ని హెరిటేజ్ ఫుడ్ ప్లాజాలను ఏర్పాటు చేయాలని యువతకి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్ర నాయుడు నారా భువనేశ్వరిని కోరడమైందని తెలిపారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందన్నారు.



## థామస్ గెలుపునకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరం మేజర్ పంచాయతీ ద్రౌపతి సమేత ధర్మరాజు ఆలయంలో విజయోత్సవ ర్యాలీ సమావేశాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యతలు యుగంధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీపీ రాష్ట్ర రైతు కార్య నిర్వక కార్యదర్శి మాదిరాజు జనార్దన్ రాజు మాట్లాడుతూ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేసిన తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ,, బిజెపి పార్టీ నాయకులకు నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జనసేన పార్టీ నాయకులు యుగంధర్‌ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు యువరాజు, పార్టీ అధ్యక్షులు చెంగల్రా యాదవ్, మాజీ పార్టీ అధ్యక్షులు వాసుదేవ రెడ్డి, బీసీ సెల్ రవి యాదవ్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దామోదరం, జిల్లా రైతు అధ్యక్షులు నాగేశ్వరరాజు, అమ్ములు, నేత ఈశ్వర్, జనసేన, బిజెపి, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## డీజీపీకి రామచంద్రయ్య శుభాకాంక్షలు

**తిరుపతి ఎడ్యుకేషన్/తిరుపతి కల్చరల్, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావును మాజీ మంత్రి సి.రామచంద్రయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం డీజీపీ కార్యాలయంలో ఆయనను మాజీ మంత్రి సి.రామచంద్రయ్య, ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ అభివృద్ధి మాజీ డైరెక్టర్ నైనారు శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి, ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఎంపీని హౌస్ అరెస్ట్ చేయడం సరైన పద్ధతి కాదు

**సత్యవేడు వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ రాజేష్**

**- ప్రజలను కవడం కూడా పాపమేనా..!**



**వరదయ్యపాలెం, మేజర్‌న్యూస్:** ఒక ఎంపిగా తన నియోజకవర్గ ప్రజలను కలుసుకునేందుకు కూడా అవకాశం లేకుండా మిధున్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేయడం సరైన పద్ధతి కాదని, ప్రభుత్వం చేస్తున్న ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సత్యవేడు నియోజకవర్గం వైసీపీ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సరిగ్గా రెండు నెలలు కూడా కాలేదని, పేదోళ్ళ ఇళ్ళపై దాడులు, వైసిపి శ్రేణులపై దాడులకు తెరతీయడం మంచిపరిణామం కాదని, అధికార ప్రభుత్వం కూడా ఒక్కసారి ఆలోచించి, దుశ్చర్యలను మానుకుని, ప్రజల క్షేమం దిశగా పాలన సాగించాలని హితవు పలికారు.

## నేడు పెన్షన్లు పంపిణీ

**కార్వేటి నగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరం మండలం కేంద్రంలో ఉన్న మేజర్ పంచాయతీ కార్యాలయం ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమాన్ని గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ థామస్ చేతులమీదుగా సోమవారం ఉదయం 10 గంటలకు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారని తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షులు చెంగల్ యాదవ్ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం, బిజెపి, జనసేన నాయకులు, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

## నామకరణం వేడుకకు హాజరైన పూతలపట్టు ఎమ్మెల్యే

**ఐరాల, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జి.భాస్కర్ నాయుడు మనవడు నామకరణ వేడుకకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళిమోహన్ హాజరయ్యారు. ఆదివారం పూతలపట్టు మండలం, చవటపల్లె గ్రామంకు చెందిన జి.భాస్కర్ నాయుడు, దేవకీ దంపతుల కుమార్తె కుమారుడి హేత్విక్ నామకరణ వేడుకకు హాజరైన ఆయన హేత్విక్‌ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.



# అంకాల పరమేశ్వరికి ఎమ్మెల్యే పట్టు వస్త్రాలు సమర్పణ

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** నగిరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ స్వగ్రామంలో శ్రీ అంకాల పరమేశ్వరి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రామచంద్రాపురం మండలం వెంకట రామాపురంలో అంకాల పరమేశ్వరి ఉత్సవాలు కథ నాలుగు రోజులుగా గ్రామస్తులు వైభవంగా జరుపుకుంటున్నారు. నగిరి ఎమ్మెల్యే భాను ప్రకాష్ స్వగ్రామం కావడంతో అమ్మవారి ఉత్సవాల సందర్భంగా గ్రామానికి చేరుకొని తన ఇంటి దగ్గర నుండి అమ్మవారికి ఊరేగింపుగా డప్పుల మధ్య పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. గాలి భాను ప్రకాష్ ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు గజమాలతో ఘనస్వాగతం పలికి మంగళ హారతుల పట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన పుట్టినూరు మరువలేనని గ్రామస్తులు నాపై చూపించిన ఆదరాభి మానాలు మరువలేనివన్నారు. ఎమ్మెల్యే వెంట చిన్న బాబు, గిడిపూడి వెంకటపతి, దుత్తలూరు దినేష్, చుక్క ధనుంజయ్ యాదవ్, సంజీవి, లోకేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఐక్యతే అభివృద్ధికి నాంది

**బలిజల ఆత్మీయ సమావేశంలో ఆర్కాట్ కృష్ణప్రసాద్**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** బలిజలంతా ఐక్యతతో ముందడుగు వేస్తే అభివృద్ధి పథంలో పండించవచ్చని, ఆ దశగా బలిజలు ముందుకు సాగాలని బలిజసేన రాష్ట్రఅధ్యక్షుడు ఆర్కాడ్ కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. బలిజసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఎస్సై శంకరయ్య పీలేరు వాయల్పాడు, అన్నమయ్య, జిల్లా బలిజల ఆత్మీయ సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బలిజ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ హాజరై మాట్లాడారు. రాయలసీమ ప్రాంతంలో బలిజలు అత్యంత వెనుకబడి ఉన్నారని, పేరుకు మాత్రమే సంఖ్యాబలమని ఆర్థికంగా రాజకీయంగా బలిజ కులస్తులు ఎదుగుదల నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బలిజ కులస్తులందరూ ఐక్యతతో ఒకరికి ఒకరు పరస్పర సహకారంతో బలిజలు అభివృద్ధి చెందాలన్నారు. ఆ దశగా ముందుకు వెళితే అన్ని రంగాలలో అభివృద్ధి సాధ్యమని తెలిపారు. అలాగే రాష్ట్రంలో అన్ని జిల్లాల నూతన కమిటీలను నియమించామని, త్వరలో పీలేరు నియోజకవర్గ బలిజసేన కమిటీలను అందరి సహకారంతో నియమిస్తామని తెలిపారు. అనంతరం బలిజ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్‌ను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్ర, పీలేరు నియోజకవర్గ్ అధ్యక్షులు శంకరయ్య, మనోహర్, రామకృష్ణ, ఆనంద, శేఖర్, వెంకటరమణ, వంశీ, శ్రీనివాసులు, రాజా పాల్గొన్నారు.



## పెన్షన్లు పంపిణీకి సర్వం సిద్ధం

**గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్**

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** ఎన్నికల సమయంలో ఎన్‌డిఏ కూటమి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెటుకుంటూ జూలై 1వ తేదీ ఉదయం 6గంటలకు పెన్షన్ల మహోత్సవ కార్యక్రమం ప్రారంభ మవుతుందని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే సునీల్ కుమార్ నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు జూలై 1న సచివాలయం సిబ్బంది ద్వారా పెన్షన్లను ఇంటివద్దే పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ బిజెపి పార్టీల నాయకులు ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించడం జరిగింది .కావున పెంచిన పెన్షన్ అన్ని పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఇంటింటికి వెళ్లి నిర్వహించాలని ఆయన ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు కూడా పెన్షన్ దారుల ఇంటికి నేరుగా వెళ్లి పెన్షన్ అందజేస్తున్నారని పేర్కొన్నారు.



## ప్రత్యామ్నయం చూపలేక, ప్రతాపం చూపితే ఎలా..?

**వరదయ్యపాలెం, మేజర్‌న్యూస్:** వరదయ్యపాలెం మేజర్ పంచాయతీలోని, గోవర్ధన పురం గ్రామం పక్కన ఉన్న కాలవ పరిస్థితిని చూసి స్థానిక సోషల్ మీడియాలో పారిశుద్ధ్యంపై అనేక పర్యాయాలు సందేశాలు వెలువడుతుంది. చికెన్ షాపు వారు ఏకంగా వాళ్ళ దుకాణలలో కోళ్ల కోసినపుడు వెలువడే రక్తపు వ్యర్థాలను పైపులు పెట్టి మరి కాలవలోకి మళ్లించడంతో, ఒకప్పటి సాగునీటి పంట కాలువ, నేడు దుర్వాసన వెదజల్లే మురుగు కాలువగా, ప్రమాదంగా తయారైందని స్థానికులు, రైతులు ఆవేదన చెందుతున్నారు. కాలువ మీద నడిచి వెళ్లాలి అంటే పాదాచారులు ముక్కులు మూసుకొని వెళ్లే పరిస్థితి ఏర్పడింది. రోడ్డు పక్కనే కోళ్లు శుభ్రం చేయడం వల్ల ఆ నీరు రోడ్డు మీద చేరి నడవలేని పరిస్థితి ఏర్పడుతుంది. బస్సు కోసం కోసం నిలబడలేని పరిస్థితి. ఇప్పుడే ఇలా ఉందంటే, రాబోవు రోజుల్లో ఆ కాలువ పక్కన మాంసం దుకాణలకి కట్టిన గదులు ఉపయోగంలోకి వస్తే అప్పుడు ఆ వ్యర్థాలు అన్ని కాలువలోకి వదిలితే కాలువ పక్కన ఉన్న నివాసల పరిస్థితి ఏంటి అని సోషల్ మీడియా ద్వారా ప్రశ్నలవర్షం కురుస్తుంది. కుళ్ళిన వాసనతో జీవించాల్సిందేనా!, ఊళ్ళో ఉండాల్సిన కూరగాయలసంత ఊరి బయట ఉంది. ఎక్కడో ఊరి బయట ఉండాల్సిన మాంసం దుకాణాలు ఊరి మధ్యలో జనావాసాల మధ్యలో ఉన్నాయంటున్నారు. ఇలా కాలవలు కలుషితం చేసే వాళ్ళని వదిలేసి ఏ రోజుకు ఆ రోజు చేపలు పట్టుకొని అమ్ముకుంటే కానీ జీవనం సాగని వాళ్ళకి శుభ్రత మీద అవగాహన చేయకపోగా, ఏకంగా పంచాయతీ వాళ్ళు చేపలును తీసేయడం ఎంత వరకు సబాబు అని ప్రశ్నిస్తున్నారు. న్యాయం అందరికి సమానమే కదా! అంటూ,ఇకనైనా ప్రత్యామ్న్యాయ మార్గం చూపెందుకు, సంబంధిత అధికారులు చొరవ చూపి, కాలువలో మురుగును తొలగించేందుకు చర్యలు చేపట్టాలని, తద్వారా ప్రజలు రోగాల బారిన పడకుండ కాపాడాలని స్థానికులు కోరుకుంటున్నారు.



చేపలు తీసుకెలుతున్న చిత్రం



కాలువలో కోళ్ల రక్తం కలుస్తున్న దృశ్యం

# పెద్దిరెడ్డి కుటుంబాన్ని జిల్లా నుంచి బహిష్కరణ చేయాలి

- రాజ్యాంగం గూర్చి మిథున్ రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉంది
- పెద్దిరెడ్డి రాజకీయ జీవితం ముగిసిన అధ్యాయం
- జిల్లా టీడీపీ నాయకులు




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా తెలుగుదేశం నాయకులు

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** వైకాపా నాయకుడు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని జిల్లా నుంచి బహిష్కరించాలని జిల్లా టీడీపీ నాయకులు పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబం వలన శాంతిభద్రతలకు భంగం వాటిల్లే అవకాశం ఉన్నందున పెద్దిరెడ్డి కుటుంబాన్ని జిల్లా బహిష్కరణ చేయాలని టిడిపి నాయకులు తెలిపారు. ఆదివారం రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా స్వామ్యంలో అధికారం శాశ్వతం కాదని, ప్రజలు తమకు 40 శాతం ఓట్లు వేశారని, రాజ్యాంగ హక్కు గురించి, రాజ్యాంగ హక్కు ప్రకారం నేను నా నియోజకవర్గంలో పర్యటిస్తానని అనడం విడ్డూరంగా ఉంది. మా నియోజకవర్గానికి రావద్దని ప్రజలు హెచ్చరిస్తున్నప్పటికీ, బలవంతంగా ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయటానికి పుంగనూరు వెళ్లడానికి ప్రయత్నించడం విడ్డూరంగా ఉంది. శాంతి భద్రతల గురించి మిథున్ రెడ్డి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టు అనిపిస్తుంది. గత ఐదు సంవత్సరాలుగా పుంగనూరు నియోజకవర్గంలో అరాచకం సృష్టించినటువంటి కుటుంబం పెద్దిరెడ్డి కుటుంబం. ప్రజలకి కనీస స్వేచ్ఛ లేకుండా చేసి దాదాపు రెండు వేల మంది పైన 307 కేసులు బనాయించి అధికార దుర్వినియోగాన్ని చూపిన పెద్దిరెడ్డి కుటుంబం ఈరోజు శాంతిభద్రతలు గురించి, నిజాయితీ గురించి, రాజ్యాంగం గురించి మాట్లాడుతుంటే నవ్వొస్తుందని అన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం యొక్క రాజకీయ జీవితం ఇక ముగిసిన అధ్యాయమని, ఇక రాజకీయ సన్యాసం తప్పదని టిడిపి నాయకులు అన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం ఇంకా కూడా తాము అధికారంలో ఉన్నామని, పుంగనూరు తమ జాగీర్ అనుకోని, పుంగనూరులో అరాచకం చేయడానికి ప్రయత్నం చేస్తున్నది, పెద్దిరెడ్డి కుటుంబాన్ని జిల్లా బహిష్కరణ చేయాలి అని టిడిపి నాయకులు కోరారు. ఈ మీడియా సమావేశంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్ ,టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, మైనారిటీ సెల్ నాయకుడు జాఫర్ ,టిడిపి పూతలపట్టు నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు ధరణి ప్రకాష్, టిడిపి నాయకుడు కృష్ణమూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీ వేంకటేశ్వర స్వామి 5వ వార్షికోత్సవ ఉత్సవం

- ఎమ్మెల్యే నానికి పూర్ణకుంభ స్వాగతం

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 5వ వార్షికోత్సవ ఉత్సవాలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. చిన్నగొట్టిగల్లు మండలం, లెక్కల వాండ్లపల్లిలో పూజలందుకుంటున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 5 వ వార్షిక ఉత్సవాలలో గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఉమ్మడి మండల పార్టీ నాయకులు, గ్రామస్తుల ఆహ్వానం మేరకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు. ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఆలయానికి చేరుకున్న పులివర్తి నానికి మేళ తాళాలతో, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ పూజారి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పులివర్తి నాని స్వామివారికి పూజా ద్రవ్యాలు సమర్పించారు. అర్చకులు స్వామి వారి దర్శనం ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించే కేంద్రాలుగా ఆలయాలు ఉన్నాయన్నారు. అందరూ తరతర భేదాలు వదిలి స్వామి వారి ఉత్సవాలలో పాల్గొనటం గ్రామ ఐక్యమత్యానికి నిదర్శనం అన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కృపాకటాక్షములు అందరి పైన కలగాలని ప్రార్థించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శేష జీవితం మంచి ఆరోగ్యంతో ఆనందంగా గడపండి

- జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** శేష జీవితం ఆరోగ్యంతో ఆనందంగా జీవించాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. జూన్ నెల పదవీ విరమణ పొందిన నలుగురు పోలీసు అధికారులను ఇద్దరు హోంగార్డులను ఆదివారం స్థానిక జిల్లా పోలీసు అతిథి భవనంలో ఎస్పీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో సుదీర్ఘ కాలం క్రమ శిక్షణతో, బాధ్యతయుతంగా విధులు నిర్వహించి, పదవీ విరమణ పొందడం అభినందనీయమని, ఇన్ని రోజులు చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వహించారు, మన మంతా ఒకే పోలీసు కుటుంబ సభ్యులమని ఎటువంటి అవసరమైన సంప్రదించండని, ఏ సమయంలో అయినా అందుబాటులో ఉండి తోడ్పాటును అందిస్తాం అన్నారు. ఈ కార్యక్రమానికి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు, సన్నిహితులు తో పాటు ఒకటవ పట్టణ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ రెడ్డి, ఆర్ఐఎం టిఓ భాస్కర్, ఆర్ఐ హోంగార్డ్స్ సుధాకర్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ అయిన పోలీస్ అధికారులను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

# నేడు మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారానికి మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ అదితిసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం మీకోసం-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని ఉదయం 10 నుంచి 1 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.



# శ్రీవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు



ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి

**తిరుమల, మేజర్ న్యూస్:** తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం విఐపీ విరామ సమయంలో సినీనటి ప్రియా ఆనంద్, టిడిపి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు., టిడిపి ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్., తిరుపతి ఎంపీ గురుమూర్తి, తెదేపా ఎంపీ అప్పలనాయుడు, తిరుపతి మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్‌లు కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరుగా స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.

**ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి**

శ్రీవారిని ఏపీ సమాచార శాఖామంత్రి కొలుసు పార్థసారథి దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం విఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు., ఒంటెద్దు పోకడ వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. పారిశ్రామికంగా, రైతాంగ పరంగా ఉపాధి పరంగా అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు తెలిపారు. చంద్రబాబు., పవన్ కళ్యాణ్, లోకేష్ బాబు, మంత్రివర్గ సభ్యులు అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తారని అన్నారు. వెనుకబడ్డ రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోదీ సహకారం అందిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల హామీ మేరకు ఐదు పథకాలపై సీఎం మొట్టమొదటి సంతకం పెట్టారని., 1వ తేదీ నుంచి పెన్షన్ పంపిణీ జరగనుందని అన్నారు. 65 లక్షల మందికి 4408 కోట్ల రూపాయలు పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఇంటివద్దనే పెన్షన్ పంపిణీ సాగిస్తామని తెలియజేశారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు జూలై 1వ తేదీ 7వేల రూపాయలు పెన్షన్ ఇస్తామని అన్నారు.

**టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్**

తిరుమల శ్రీవేంకటేశ్వరుని టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం విఐపి విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల గౌతమ్ గంభీర్ మీడియాతో మాట్లాడుతూ టీ20 వరల్డ్ కప్ విజయంతో 140 కోట్ల భారతీయులను గర్వపడేలా చేసిందన్నారు. రాహుల్ ద్రవిడ్, రోహిత్ శర్మ, టీమ్ ఇండియాకు నా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కోహ్లీ., రోహిత్ శర్మలు వరల్డ్ కప్ సాధించి టి20కి రిటైర్మెంట్ ప్రకటించడం చాలా మంచి సందర్భమన్నారు. వన్డే, టెస్ట్ క్రికెట్‌లో రోహిత్., కోహ్లీలు తమదైన పాత్ర పోషించి జట్టును విజయపథంలో నడపాలి కోరుకుంటున్నట్లు తెలిపారు.



తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్

**తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

తిరుమల శ్రీవారిని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం విఐపి విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ నూతనంగా ఏర్పడ్డ ఏపీ ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం వద్ద నుంచి విభజ హామీలు వచ్చేలా ఇరు రాష్ట్రాలు పోరాడాలని కోరుకున్నట్లు తెలిపారు. తెలంగాణ భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని ఏపీ ప్రభుత్వాని కోరుతున్నానని అన్నారు. తెలంగాణ సిఫార్సులను అమలించాలని విజ్ఞప్తి చేశారు. తెలుగువారం అంతా ఒక్కటే అనే నినాదంతో వెళ్లాలని తెలియజేశారు.








# టీటీడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి...

**- ఈవోకు టీటీడీ జనరల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి**

**తిరుపతి(అర్బన్), మేజర్ న్యూస్:** టీటీడీలో ఇప్పటివరకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని టీటీడీ జనరల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ముని వెంకట రెడ్డి ఈవో జే శ్యామలరావును కోరారు. ఈ మేరకు ఆదివారం అసోసియేషన్ నాయకులు, సభ్యులతో ఈవోను ఆయన చాంబర్ నందు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అనంతరం ముని వెంకటరెడ్డి మాట్లాడుతూ టిటిడి ఉద్యోగులకు ఇప్పటి వరకు రెండు ఫేసులలో ఇళ్ల స్థలాలు ఇచ్చారని పదవీ విరమణ చేసిన వాళ్లకు అలాగే రెండవ ఫేస్‌లో మిగిలిన ఉద్యోగులకు సాధ్యమైనంత వరకు ఏర్పేడు వద్ద ఇల్లు స్థలాలు ఇవ్వాలని కోరారు. అలాగే టిటిడి కి సంబంధించిన సిమ్స్ ఆసుపత్రిలో కాకుండా ఉద్యోగులకు రెండు రెఫరల్ హాస్పిటల్లో వైద్యం చేసుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. తిరుమల రిసెప్షన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్యాలయ అధీనుల సంఖ్య తక్కువగా ఉందని,ఈ ఏడాది చాలామంది కార్యాలయ అధీనులు పదవీ విరమణ చేస్తుండడంతో ఆ పని భారం వారి మీద విపరీతంగా పెరుగుతుంది కాబట్టి రిసెప్షన్ ఏరియాల్లో అధీనుల సంఖ్య పెంచాలని కోరారు. చాలాకారంగా నిలిచిపోయిన ప్రమోషన్లను సాధ్యమైనంత వరకు త్వరగా ఇప్పించాలని ఈవో శ్యామరావుకు ముని వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టిటిడి జనరల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ ఆఫ్ జనరల్ రామకృష్ణ ట్రెజరర్ ఎల్ ఎన్ వి. రవికుమార్, సుబ్రమణ్యం ఎమ్మెస్. రాయుడు, సుబ్రమణ్యం, రాధాకృష్ణ, మనోహర్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

# నెరవేరిన పలు గ్రామాల ప్రజల పదేళ్ల కల

**-కాణిపాకం టు బంగారుపాళ్యం ఆర్టీసీ బస్సు ప్రారంభించిన పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి**

**- స్వయంగా బస్సు నడిపిన పూతలపట్టు ఎమ్మెల్యే**



కాణిపాకం టు బంగారుపాళ్యం ఆర్టీసీ బస్సు ప్రారంభిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి

**ఐరాల, మేజర్‌న్యూస్:** ఆయన అందరిలాగా ప్రజాప్రతినిధి కాదు. నిత్యం ప్రజల మధ్య ఉండే వ్యక్తి ఆయన. ప్రజల సమస్యలపై నిత్యం దృష్టి సారిస్తుంటారు. తన సొంత నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులు లేదన్న విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మోహన్ తెలుసుకున్నారు. ఆదివారం చిత్తూరు 1వ ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సర్వీసును కాణిపాకం వయా అరగొండ, ఎ. గొల్లపల్లి, మీదుగా బంగారు పాళ్యం వరకు ప్రజలు సౌకర్యార్థం పూతలపట్టు నియోజకవర్గం, తవణంపల్లె మండలం, ఏ.గొల్లపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన బస్సు సర్వీసును పచ్చ జెండా ఊపి ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ చేతులు మీదగా ప్రారంభించారు. సుమారు పదేళ్ళ తర్వాత కాణిపాకం-బంగారుపాళ్యం వయా అరగొండ, ఏ.గొల్లపల్లె మధ్య ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించి గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యను ఎమ్మెల్యే పరిష్కరించారు. ఆ తర్వాత డ్రైవర్‌గా మారిన ఎమ్మెల్యే ప్రయాణికులతో నిండిన ఆర్టీసీ నడుపుతూ ప్రజలను ఆశ్చర్యానికి గురిచేశారు. అనంతరం స్వయంగా బస్సు టిక్కెట్ కొని ప్రయాణికులతో కలిసి ప్రయాణం చేశారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన తర్వాత వారి ఆనందానికి అవధుల్లేవు. ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏ.గొల్లపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రసంగిస్తూ నేను అందరిలా ప్రజాప్రతినిధి కాదని, నిత్యం ప్రజల మధ్యన ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించే వ్యక్తినని చెప్పారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికే ప్రజలు తీసుకుని రావచ్చని, తనే నేరుగా పరిష్కరిస్తానంటూ హామీ ఇచ్చారు. తనకు ఎమ్మెల్యే హొదా ప్రజలు ఇచ్చారని, వారి శ్రేయస్సు పరమావధిగా పని చేస్తానంటూ చెప్పారు. దాదాపు పదేళ్ళుగా ఏ.గొల్లపల్లె సమీప ప్రాంతాల ప్రజలు బస్సు సర్వీసు లేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తన దృష్టికి రాగానే వేంటనే ఆర్టీసీ అధికారులకు చెప్పి బస్సు సర్వీసును ఏర్పాటు చేశామన్నారు. మహిళలు, విద్యార్థులు, ప్రజలు బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు1వ ఆర్టీసీడిపో మేనేజర్ కృష్ణ మూర్తి,కాణిపాకం ఆలయ మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు ఎన్.ప్రవీణ్‌కుమార్, బంగారు పాళ్యం మండల టీడీపీ కన్వీనర్ ఎన్.జయప్రకాష్ నాయుడు, కాణిపాకం పూర్ణచంద్ర రావు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కూటమితో సఖ్యతగా ఉండి ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

**- బీజేపీ జిల్లా అధ్యక్షులు జగదీశ్వర్ నాయుడు**

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** కూటమి నాయకులతో సఖ్యతగా ఉండి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు అన్నారు. చంద్రగిరి మండలం ఓ ప్రైవేటు హోటల్లో చంద్రగిరి అసెంబ్లీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీలో చేరే ఇతర పార్టీ కార్యకర్తలను జిల్లా పార్టీ అనుమతి లేనిది చేర్చుకోరాదని ఆయన తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిందని, రాజకీయ లబ్ధి కోసం పార్టీలోకి వచ్చే నాయకులు బిజెపికి అవసరం లేదన్నారు. చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న ప్రతి బీజేపీ నాయకులు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలపై దృష్టి సారించి ప్రజల్లో బిజెపి పార్టీని పటిష్టం చేయాలన్నారు. కేంద్రంలో బిజెపి పార్టీ చేస్తున్న అభివృద్ధిని, రాష్ట్రంలో కూటమి మా ఇంట్లో సహకారంతో చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం స్థానిక బిజెపి నాయకుల



ఆధ్వర్యంలో అమ్మ కోసం కార్యక్రమంలో భాగంగా చెట్లు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మునిగింగి రెడ్డి, జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వెంకటముని, జిల్లా ఇన్చార్జ్ విశ్వనాథం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యం యాదవ్, గాలి పుష్పలత, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు హరినాథ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీధర్ బాబు, చంద్రగిరి నియోజకవర్గం మండలాల అధ్యక్షులు దొరస్వామి, బ్రహ్మం, శంకర్ రెడ్డి, వెంకట శివారెడ్డి, ఈశ్వర్, చండీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# మంగళంపేటలో ఎన్డీఏ కూటమి విజయోత్సవ ర్యాలీ

**కల్లూరు, మేజర్‌న్యూస్:** పుంగనూరు నియోజకవర్గం పులిచెర్ల మండలం మంగళంపేట బలిజపల్లిలో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ ,జనసేన పార్టీ అధికారంలోకి ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు పదవీ బాధ్యతలు చేపట్టడం, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆదివారము మండలంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ చిన్న రాయల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను అర్హులకు అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి అధికారులు దృష్టికి తీసుకుని వచ్చి సమస్యలను పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి గ్రామంలో జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించాలని జన సైనికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు సరిత నాగరాజు, జనార్ధన్, మునిశేఖర్, దీపు, చంద్ర, మనోహర్, హేమచంద్ర రాయల్, శ్రీనివాసులు భారీ ఎత్తున జనసైనికులు పాల్గొన్నారు.



# ప్రజా దర్బార్ ద్వారా సమస్యలు పరిష్కారం

**- 31వ డివిజన్ ఇంచార్జ్ శ్రీరామ్ లోచన్**

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా స్థానిక డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని జన సేన నాయకులు 31 వ డివిజన్ ఇంచార్జ్ శ్రీరామ్ లోచన్ తెలిపారు. ఆదివారం చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ 31 వ డివిజన్ లో పర్యటించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు 31వ డివిజన్ ఇంచార్జ్ శ్రీరామ్ లోచన్ పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరించడానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు.



సమావేశంలో తెలియజేస్తున్న జనసేన నాయకులు శ్రీరామ్

# పోలవరం విధ్వంసానికి జగనే కారణం

**- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ వెంకటీల**

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** పోలవరం ప్రాజెక్టు విధ్వంశానికి మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డే కారకూడని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ వెంకటీల తెలిపారు. ఆదివారం నగరంలోని స్థానిక జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సురేంద్ర కుమార్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నేటి దుస్థితి పై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వాస్తవాలు ప్రజల ముందు ఉంచడంతో సమాధానం చెప్పలేని జగన్, వైకాపా నాయకులు మొఖం చాటేసి సాక్షి పత్రిక ద్వారా అసత్య ప్రచారాలకు సిద్ధమయ్యారన్నారు. రాష్టానికి జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై 2014-2019 మధ్య టీడీపీ పాలనలో చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధతీసుకొని ప్రతి సోమవారం ను పోలవరం వారం గా చేసుకొని పనులను పరుగులు పెట్టించి 72 శాతం పనులు పూర్రి చేసారని, 2019 సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ మరలా అధికారం లోకి వచ్చియుంటే పోలవరం పూర్రియై యుండేదని, 2019 -2024 సంవత్సరాల మధ్య కాలం లో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రివర్స్ టెండరింగ్ పేరిట కాంట్రాక్టర్‌ను మార్చి పట్టించుకోక పోవడం, 15 నెలలు కాలం పనిచేయకపోవడం తో వర్షాలకు డయాఫ్రం వాల్ కొట్టుకుపోవడంతో ప్రాజెక్ట్ ధ్వంసం అయింది, జగన్ పాలనలో కేవలం 3.84 శాతం పనులు మాత్రమే జరిగాయి. ఇది సిగ్గుచేటు, ?ఇప్పుడు జరిగిన నష్టాన్ని భర్తీ చేయడం మరమ్మత్తులు చేయడం చాల కష్టం కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విదేశాల నుండి నిపుణులను తీసుకువచ్చి పోలవరం నిర్మాణ పనులను పూర్తి చేస్తారని ప్రజలు వాస్తవాలను గుర్తించి సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ వెంకటీల

# సుపరిపాలన చంద్రబాబునాయుడుతోనే సాధ్యం

**– టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్ బాబు**

**రామకుప్పం, మేజర్‌న్యూస్:** భారతదేశంలోని అపార పరిపాలన అనుభవం కలిగిన నిజాయితీ నిబద్ధతతో ప్రజాసేవకే అంకితమైన నారా చంద్రబాబు నాయుడుతోనే నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని విజలాపురం గ్రామపంచాయతీలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన ఆయన మాట్లాడుతూ విజిలాపురం సమీపాన గతంలో ఏర్పాటు చేయ తలపెట్టిన విమానాశ్రయ పనులను పూర్తిగా తన పూర్తి చేసి



రామకుప్పం మండలం అన్ని రంగాలలో అగ్రగామిగా నిలవడానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందన్నారు, సోమవారం నుండి ప్రభుత్వం పంపిణీ చేయనున్న సామాజిక పింఛన్ల కార్యక్రమాన్ని స్థానిక అధికారులతో కలిసి ఎన్డీఏ కూటమినేతలందరూ లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని, మున్ముందు కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా ప్రారంభమై ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందడం కాయమన్నారు, గత 35 సంవత్సరాలుగా కుప్పం నియోజకవర్గం ప్రజలు నారా చంద్రబాబునాయుడుని తమలో ఒక కుటుంబ సభ్యునిగా భావించి అన్ని ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకున్న ప్రజలకు రానున్న ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను బాబు అమలు చేయడం గ్యారెంటీ అన్నారు, ఇందుకోసం స్థానిక నాయకులు అధికారులతో సమన్వయం చేసుకొని అన్ని కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి, ముఖ్య నేతలు పత్రా నారాయణ ,రామమూర్తి, శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ వెంకటేష్, తెలుగు యువత విశ్వనాథ్, జయశంకర్, పత్రా సత్య, విజిలాపురం కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయుడు హేమారెడ్డి సేవలు మరువ లేనివి

**- తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్**

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలంలోని కత్తెరపల్లి పంచాయతీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న హేమా రెడ్డి సేవలు మరు లేవని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ శేఖర్ అన్నారు. కార్వేటినగరం కత్తిరిపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ కార్యక్రమాన్ని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు వాసుదేవన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ 36 సంవత్సరాలు పాటు ఉపాధ్యాయులు ఇతను చేసిన సేవలు మరువ లేవన్నారు. ఈ పాఠశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఈ పాఠశాలకు ప్రార్థన మందిరం, సరస్వతి విగ్రహం ఏర్పాటు, లైబ్రరీ, త్రాగునీటి బోరు ఏర్పాటు చేయడం, వారి తల్లిదండ్రుల పేరుపైన భవనం నిర్మించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి ప్రభాకర్ రాజు, మండల విద్యాశాఖ అధికారులు విజయ్ కుమార్, సతీష్, బాబయ్య, నమశ్శివాయ, కేశవులు చంగల్



రాజు ఎంపీపీ లతా బాలాజీ, కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ, మండల పార్టీ అధ్యక్షులు చంగల్రా యాదవ్, మాదిరాజు మురళి కృష్ణం రాజు, తుడ కృష్ణారెడ్డి, సత్యవేడు నియోజకవర్గ వైయస్సార్ పార్టీ అభ్యర్థి రాజేష్ మాజీ జెడ్పిటిసి సభ్యులు దేవకీ లోకనాథ్ రెడ్డి, అనంతరం ఎస్టియు ఉపాధ్యాయ సంఘం నాయకులు గాజుల నాగేశ్వరరావు, ఏపిటిఎఫ్ నాయకులు ఉపాధ్యాయ బృందం బంధువులు మిత్రులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు ఉపాధ్యాయిని, విద్యార్థిని విద్యార్థులు బంధుమిత్రులు పాల్గొన్నారు.

# సేవ చేసే అవకాశం ఇచ్చిన రోటరీకి ధన్యవాదాలు

**గూడూరు, మేజర్‌న్యూస్:** పేదలకు సేవ చేసే అవకాశం కల్పించిన కోస్టల్ జోన్ లో ఉన్నరోటరీ క్లబ్‌ల బాధ్యలకు వీడుకోలు దన్యవాదాలు తెలిపారు. ఆదివారంతో రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా మయూరి శ్యామ్‌యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. గూడూరు,గూడూరు వెస్ట్, కోట,నాయుడుపేట,సూళ్లూరుపేట రోటరీ క్లబ్‌లు ప్రజలకు ఉపయోగపడే విధంగా అనేక సేవ కార్యక్రమాలు చేసినందులకు గూడూరు మెయిన్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ స్వరూప్ , శ్రావణ్ ,సీనియర్ రొటేరియన్ దశరదరామిరెడ్డి పిడీజీలు మునిగిరీష్ ,సురేంద్ర రెడ్డి, గూడూరు వెస్ట్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు



సనత్ కుమార్ రెడ్డి , శివకుమార్ కోట రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జమ్మి ప్రసాద్ , యస్ కె జలీల్, నాయుడుపేట రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ గోపీనాథ్ ,రామ్మోహన్ రావు, సూళ్లూరుపేట రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు దశరథ రెడ్డి , వినయ్ సాగర్ ,మరియు ఐదు క్లబ్ ల సభ్యుల అందరికీ ఆయన ఈసందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా 2024–25 సంవత్సరానికి ఎన్నిక కాబడిన కోస్టల్ పరిధిలోని ఐదు క్లబ్ ల నూతన అధ్యక్ష కార్యదర్శులు అందరికీ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రజా సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి

**గూడూరు, మేజర్‌న్యూస్ :** విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలు, సమాజంపై అవగాహన కలిగి ఉండాలని ఎపి విద్యార్థి జెఏసి రాష్ట్ర ఉపాధ్యక్షులు నవీన్‌కుమార్ తెలిపారు. ఆదివారం గూడూరు నియోజకవర్గం విద్యార్థి జెఏసి కమిటీ ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఏపీ స్టూడెంట్స్ జెఏసి గూడూరు నియోజకవర్గ అధ్యక్షులుగా బిరదవోలు లవన్ కుమాం, నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా సూర్య నియమిస్తున్నట్లు తెలియజేశారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో ఏపీ స్టూడెంట్స్ జేఏసీని బలోపేతం చేస్తూ నియోజకవర్గ కమిటీలు, జిల్లాస్థాయి కమిటీలు, రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో కూడా పూర్తిస్థాయిగా ఏపీ స్టూడెంట్స్ జెఏసిని, బలోపేతం చేస్తున్నామని తెలియజేశారు. గత పదేళ్లుగా కేంద్రంలో ఉన్న అధికార పార్టీ రాష్ట్రానికి రావాల్సినటువంటి విభజన హామీ చట్టాలను సాధించుకోలేకపోయామని, ఈరోజు పార్లమెంటులో ఉన్నటువంటి అధికార పార్టీకి సంఖ్యాబలం సరిగా లేనందువలన ఇతర పార్టీలపై ఆధారపడటం చేత ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా మా ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జెఏసి కమిటీలను బలోపేతం చేసి ఉద్యమాన్ని తీవ్రతరం



చేయనున్నట్లు తెలియజేశారు.. అంతేకాకుండా గతంలో సమైక్యాంధ్ర ఉద్యమాన్ని ఏ విధంగా చేశామో రాష్ట్ర ప్రజలందరికీ కూడా తెల్సుని అంతకన్నా రెట్టింపుతో రాష్ట్రానికి రావాల్సినటువంటి ప్రత్యేక హోదా, విభజన హామీలను చట్టాలు అన్నిటిని సాధించుకొనుటకు కేంద్రంతో పోరాడుతామన్నారు. అన్ని జిల్లాల్లో కమిటీలు పూర్తిచేసి మా యొక్క అజెండాలను రాష్ట్రస్థాయిలో ప్రకటన చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా ఎస్సీ యూనివర్సిటీ అధ్యక్షులు ఉపేంద్ర పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ ఏపీ స్టూడెంట్స్ జెఏసి కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, జెఏసి కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## మలబార్ నువ డైమండ్ ప్రదర్శన ప్రారంభం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో నూతనంగా ఏర్పాటు చేసిన సరికాతో వజ్రాభరణాల ఆవిష్కరణతో నువ డైమండ్ ప్రదర్శనను ఆదివారం కస్టమర్లచే ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం హెడ్ రెజీష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా తమ షోరూంలలో నువ డైమండ్స్ కలెక్షన్ కరీనా ఖాన్ చేతుల మీదుగా ఆవిష్కరించి ప్రదర్శించడం జరుగుతోందని తెలిపారు.



ప్రకృతి ప్రసాదించిన సంక్లిష్టమైన ఆకృతులు, అలలు, వివిధ రూపాలు, మడతలు, అల్లికల నుంచి ప్రేరణ పొంది విలాసవంతమైన వజ్రాభరణాలుగా అద్భుతంగా రూపొందించిన అనేక రకాల వజ్రాభరణాలను ప్రదర్శనలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అద్భుత కళాకృతమైన రీతిలో మహిళలకు గాంభీర్యాన్ని, అందాన్ని అందించేలా ఈ వజ్రాభరణాలు రూపొందించడం జరిగిందన్నారు. ఈ ప్రదర్శనను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఉచిత మినరల్ వాటర్ పంపిణీ



**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో కొండూరు సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహకారంతో ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ చేశారు. ICS రోడ్డులో కూరగాయల మార్కెట్ పక్కన ఉచిత చలివేంద్రం ప్రారంభించి నాలుగు నెలలు నిర్వహించారు. వర్షాలు ప్రారంభమైనందున చలివేంద్రం తీసి వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉచితంగా మినరల్ వాటర్, మజ్జిగ, గుగ్గిళ్ళు, పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, సెక్రటరీ జి చంద్రశేఖర్, ట్రెజరీ కాటూరి శ్రీనివాసులు, పూడి విజయ్, కొండూరు హరిబాబు కుటుంబ సభ్యులు వాకాటి రామ్మోహన్, మాముదూరు రాదయ్య, రాము, కెఆర్ఎం, దయాకర్ (ఎక్సైజ్) కోట వెంకటేశ్వర్లు, పిల్లిళ్ల శీను పోతిరెడ్డి పెంచలయ్య, వెంకటేశ్వర్లు, నాగరాజు, వల్లంకొండ ప్రణీత్ పాల్గొన్నారు.

## పేదలకు నిత్యావసరాలు పంపిణీ

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం గున్నం సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు గున్నంరెడ్డి మధుసూదన్ రెడ్డి ఆర్థిక సహకారంతో జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సనత్ కుమార్ రెడ్డి



మాట్లాడుతూ ఓజిలి మండలం బట్ల కనుపూరు గ్రామానికి చెందిన గున్నం రెడ్డి మధుసూదన్ రెడ్డి అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఉంటారని, రెడ్డి సంఘం ద్వారా కూడా సేవ చేయటం అభినందనీయమని అన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పేట వెంకట కృష్ణారెడ్డి ధనంజయరెడ్డి తదితరులు గుణ్ణం సేవ ట్రస్ట్ పేదలకు పలసరుకులు ప్రతినెలా క్రమం తప్పకుండా ఇవ్వటాన్ని అభినందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా విజయ భాస్కర్ రెడ్డి, రాఘవరెడ్డి,హరినాద్ రెడ్డి, ప్రహ్లాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తాళమ్మ గుడిలో ప్రత్యేక పూజలు

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** గ్రామదేవత తాళమ్మ దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక



పూజలు నిర్వహించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మెన్ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఆలయ ఛైర్మెన్ శ్రీనివాసులు మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ద్రౌపది అమ్మవారి సేవలో రాజేష్



రాజేష్‌ను సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్త

**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** చవట గుంట మహాభారతం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సత్యవేడు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నూక తోటి రాజేష్ ద్రౌపతి దేవి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యనిర్వాకులు ఆలయ మర్యాదలతో పూజలు చేపించి సన్మానించారు. మహాభారతం ధర్మకర్త వేట రాధాకృష్ణారెడ్డి రాజేష్ ను సత్కరించారు. రాజేష్ వెంట భాను ప్రకాష్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు

## గంగమ్మను దర్శించుకున్న కౌన్సిలర్

**పలమనేరు, మేజర్‌న్యూస్:** పట్టణ సమీపంలోని నీళ్ల కుంట గ్రామంలో వెలసిన శ్రీ గంగమ్మ తల్లిని 19 వ వార్డు కౌన్సిలర్ క్యాడీయస్ రాజేష్ కుటుంబ సభ్యులు గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ గంగమ్మ తల్లి దీవెనలు ప్రజలందరికీ అందించాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలోఆయన వెంట నీల కుంట గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## డయేరియా వ్యాధిపై హెల్ప్ లైన్ ఏర్పాటు



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తాగునీటి కాలుష్యం వలన కలిగే డయేరియా వ్యాధిపై ప్రజల నుండి వచ్చే పిర్యాధులకు, అలాగే డెంగ్యూ, మలేరియా వ్యాధుల పిర్యాధు, సహాయం కొరకు హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో తాగునీరు కలుషితం లేక తాగునీటిలో డ్రైనేజి కలుస్తున్నట్లు తెలిసిన వెంటనే హెల్ప్ లైన్ నెంబర్ 0877-2256766 ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ నెంబర్ 24 గంటలు పనిచేస్తుందని, నగర ప్రజలు డయేరియా సంబంధిత ఫిర్యాదులు ఈ నెంబర్ ద్వారా చెప్పచ్చన్నారు. ఇందుకోసం మూడు నగర పలక సంస్థ కార్యాలయంలో మూడు స్విఫ్ట్ లుగా సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూలై 10 వరకు ఫిర్యాదులు చేయవచ్చని కమిషనర్ తెలియజేశారు.

## ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుక గోడపత్రిక



**గూడూరు, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపిటిఎఫ్) ఆవిర్భవించి 80 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా అక్టోబర్‌లో నిర్వహించే వైజ్ఞానిక సభలు విజయవంతం చేయాలని ఏపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు యస్.చిరంజీవి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఆంధ్రనాట ఇన్ని సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సంస్థ ఏపిటిఎఫ్ మాత్రమేనని,ఎన్నో పోరాటాలు ప్రభుత్వ నిర్బంధాలను ఎదుర్కొని ఉపాధ్యాయ సంక్షేమం కోసం, విద్యారంగం కోసం అవిరళ కృషి చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి విదాన పరమైన సహకారం అందించేందుకు దిశా నిర్దేశం చేయుటకు పెద్ద ఎత్తున రాష్ట్ర మహాసభలను అక్టోబర్ లో విజయనగరంలో జరపడానికి నిర్ణయం జరిగిందన్నారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.జి.ఓ నం 117 రద్దు చేయాలని,అంతర్ జిల్లా బదిలీలు జరపాలని,12వ వేతన సవరణ కమిటీని అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.కె.బాబు,జిల్లా ఉపాధ్యక్షులు ఎం.జైపాల్ రెడ్డి, గూడూరు మండల శాఖ అధ్యక ప్రధాన కార్యదర్శులు బి.శివకుమార్, ఎ.భాస్కర్ రెడ్డి,వి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** వెదురుకుప్పం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భైరవుడు ఆదివారం తెలిపారు. దరఖాస్తులు చేయదలుచుకున్న విద్యార్థులు జూలై 24 సాయంత్రం 5 గంటలకు ఐటిఐ ఎన్ఐసి ఇన్ వెబ్సైట్ నందు అప్లై చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, జూలై 25 ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల లోపు వెదురుకుప్పం ప్రభుత్వ ఐటిఐ నందు హాజరై తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేపించుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేపించుకున్న విద్యార్థులు జూలై 27 ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెదురుకుప్పం ప్రభుత్వ ఐటిఐ నందు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ కోరారు. ఇటువంటి కాల్ లెటర్స్ పంపడం జరగదని విద్యార్థులకు సూచించారు.

## మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



**కార్వేటి నగరం, మేజర్‌న్యూస్:** జిల్లాలో ఉన్న మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని చిత్తూరు రైతు జిల్లా అధ్యక్షులు నాగేశ్వర రాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కార్యాలయంలో వినతి పత్రాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు చిరంజీవి లక్ష్మీ రవిరాజు పాల్గొన్నారు.

## ఫించన్లు పెంపుదలతో పేదల బతుకుల్లో వెలుగులు



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు సామాజిక ఫించన్లు పెంపుదలతో వారి బ్రతుకుల్లో వెలుగులు నింపారని నాయీ బ్రాహ్మణ సాధికార సమితి టీడీపీ తిరుపతి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం నుంచి ప్రారంభించనున్న ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే అది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తోనే సాధ్యం అన్నారు. గత పాలకులు నిర్లక్ష్యం వలన రాష్ట్రం అప్పులు ఊబిలో కూరుకుపోయిన ఎన్నికల్లో ఇచ్చిన హామి మేరకు ఫించన్లు పెంచినట్లు తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని రీతిలో కనీవినీ ఎరుగని విధంగా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా నేడు ఫించన్లు పంపిణీ చేస్తుండటం హర్షించదగ్గ విషయమని కోట చంద్రశేఖర్ పేర్కొన్నారు.

## పండుగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ



**కుప్పం, మేజర్‌న్యూస్:** సీఎం నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జూలై ఒకటో తారీకున అవ్వ తాతలకు పండుగ వాతావరణంలో 7 వేల రూపాయల పెన్షన్ అందజేయడం జరుగుతుందని కుప్పం మున్సిపాలిటీలో టీడీపీ అధ్యక్షుడు రాజ్ కుమార్ ఆదివారం పేర్కొన్నారు. మున్సిపాలిటీలో ఉదయం 6 గంటల నుండి పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ఎన్ డీ ఏ కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొని పెన్షన్ లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్ళి అందించాలని రాజ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## గురుకుల పాఠశాల సమన్వయకర్త జయ భారతి సేవలు ఎనలేనివి : తిరుపతి కలెక్టర్

**- నేను కలెక్టర్‌గా ఉన్నత స్థాయికి ఎదగడానికి కారణం మా అమ్మ**
**- అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్**



**తిరుపతి బ్యూరో మేజర్‌న్యూస్ :** సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల సంస్థ ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త జయ భారతి సేవలు ఎనలేనివి అని జిల్లా కలెక్టర్ ధ్యాన చంద్ర కొనియాడారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త పదవీ విరమణ సన్మాన సభ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల సంస్థ ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త జయభారతి సేవలు ఎనలేవని తెలిపారు. పదవీ విరమణ అనేది ప్రతి ఒక్క ఉద్యోగికి సాధారణం అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో సుదీర్ఘంగా 34 సంవత్సరాలు సేవలందించారని తెలిపారు. నేడు పదవీ విరమణ పొందుతున్న డి సి ఓ వారి జీవితాన్ని ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా గడపాలని ఆ దేవుడు వారికి ఆయురారోగ్యాలు అందించాలని కోరుకుంటున్నాను అని తెలిపారు. డిసిఓ కుమారుడు ప్రస్తుత అన్నమయ్య జిల్లా కలెక్టర్ అయిన అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ మా అమ్మ విజయవంతంగా తన పదవీ కాలాన్ని పూర్తిచేసుకుని ఈరోజు పదవి విరమణ పొందుతున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. నేను ఈరోజు ఉన్నత స్థాయిలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ గా ఉన్నానంటే దానికి మా అమ్మే కారణమని తెలిపారు. నేను చిన్నప్పుడు నుంచి పుట్టి పెరిగింది గురుకుల పాఠశాలలోనేని, నాకు చదువు నేర్పించిన ఉపాధ్యాయులు ఇక్కడే ఉన్నారని, వారి సమక్షంలో ఈరోజు అమ్మ పదవీ విరమణ పొందుతున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. శ్రీవెంకటేశ్వర స్వామి దయవల్ల ఈ ప్రభుత్వంలో కలెక్టర్ గా పనిచేస్తూ, అమ్మ కూడా ఇదే ప్రభుత్వంలో పని చేస్తూ ఈ పదవీ విరమణ కార్యక్రమానికి హాజరవ్వడం సంతోషంగా ఉందన్నారు. విజయం ఎలా పొందాలి, ఎలా సాధించాలి అనేది మా అమ్మని చూసే నేర్చుకున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తిరుపతి, చిత్తూరు జిల్లాల ప్రధాన ఉపాధ్యాయులు, బోధన, బోధనేతర సిబ్బంది డి సి ఓ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దక్కిలి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లు ప్రభావతి, శ్రీదేవి ఉమ్మడి తిరుపతి చిత్తూరు జిల్లాల ప్రధానోపాధ్యాయులు బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రోటరీ క్రీడలు ప్రారంభించిన ఎమ్మెల్యే పాశిం

**గూడూరు, మేజర్‌న్యూస్:** క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు పోటీ తత్వం పెంపొందేందుకు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఆదిశేషారెడ్డి ప్రభుత్వ



క్రీడా ప్రాంగణంలో రోటరీ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణం క్రీడలకు ప్రసిద్ధని ముఖ్యంగా హాకీ క్రీడ భారతదేశం గర్వించ దగ్గ క్రీడాకారులు ఇక్కడ నుంచి వచ్చినట్లు పేర్కొన్నారు. గూడూరు నియోజకవర్గ ప్రజలకు తాను ఎంత చేసినా తక్కువేనని వారికి మేలు చేసేందుకు జీవితాంతం కృషి చేస్తానని పేర్కొన్నారు. గతంలో వలె విధ్వంస పాలన ఉండదని అభివృద్ధి, ప్రజలకు మేలు చేకూర్చే కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. అంతకు మందు రోటరీ క్రీడలు ప్రారంభానికి సూచికగా క్రీడా జ్యోతిని ఎమ్మెల్యే పాశిం వెలిగించారు. ఇంకా ఈ కార్యక్రమంలో డాక్టర్ జానార్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, భాస్కర్‌ర్డి. వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర కీలకం... మనకు కనిపించే దేవుడు ఉపాధ్యాయుడు

**- ఎమ్మెల్యే సతీమణి పులివర్తి సుధారెడ్డి**



**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం చెన్నుగారిపల్లి పంచాయతీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డికి ఆదివారం ఘన స్వాగతం పలికారు. చెన్నుగారిపల్లిలో ఉన్న ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటస్వామి పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై వారికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ చిత్రానికి పూలమాలవేసి,జ్యోతి ప్రజ్వలన చేశారు. చదువుల తల్లి సరస్వతి దేవి చిత్రపటానికి పూల మాలవేసి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర పోషిస్తాడని తెలిపారు. విద్యార్థులకు విద్యావేత్త, సంరక్షకుని పాత్రను స్వీకరిస్తారు. ఒక మంచి వ్యక్తిగా, సమాచారం ఉన్న వ్యక్తిగా మారడానికి మీకు సహాయపడే వ్యక్తి ఉపాధ్యాయుడని అన్నారు. యువత విద్యావంతులుగా అవగాహన కల్పించినప్పుడు నిజానికి విద్యార్థుల భవితవ్యం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని, విద్యార్థులు ఉన్నత శిఖరాలను సాధించి, విజయవంతమయ్యేలా ప్రోత్సహిస్తారని పేర్కొన్నారు.

## ఉత్తమ కమ్యూనిస్టు ఏవీ వర్మ

**- ఆయన జీవితం కార్యకర్తలకు ఓ విజ్ఞాన గని సీపీఎం నేతలు మధు, నరర్సింగ్రావు ఉద్ఘాటన**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** సమ సమాజ స్థాపన కోసం అహర్నిశలు శ్రమించిన ఉత్తమ కమ్యూనిస్టు ఏవీ. వర్మ అని, ఆయన ఆ కార్యకర్తలకు ఓ విజ్ఞాన గని అని సీపీఎం అఖిల భారత నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు పి.మధు, సీఐటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావులు ఉద్ఘాటించారు. యశోదనగర్ లోని వేమన విజ్ఞానకేంద్రు సీఐటీయూస జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి



అధ్యక్షతన ఆదివారం ఎర్రజెండా నీడన నా అనుభవాలు పుస్తకం ఆవిష్కరణ సభ నిర్వహించారు. దీనికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం 70 ఏళ్లుగా నిక్కచ్చిగా నిలబడటమే కాక అదే పంథాలో త కుటుంబాన్ని అంతటిని ఎర్రజెండా బాటలోనే నడిపించిన ఏవీ. వర్మ జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 18 మండలాలకే పరిమితమైన సీపీఎంను తన 60 ఏళ్ల వయస్సులోనూ అలుపెరగకుండా జిల్లా అంతటా తిరిగి 66 మండలాల్లో శాఖలను ఏర్పాటు చేశారన్నారు. అలాంటి వ్యక్తి 83 ఏళ్ల వయసులోనే అనుభవాలను నేటి తరానికి పుస్తక రూపంలో అందించడం ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం సభాధ్యక్షుడు కందారపు మురళీ, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ కమ్యూనిస్టు నేతగా ఏవీ వర్మ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యోఉడు జీబీఎస్.మణ్యం, ప్రముఖ సాహితీవేత్త దామోదరం, నాగేశ్వరరావు, వర్మ సోదరులు పున్నారావు, నాగేశ్వరరావు, కల్యాణి, వనజ, పద్మజ, చైతన్య, లహరి, హరిణి పాల్గొన్నారు.

# తోతాపురి మామిడి గిట్టుబాటు ధర కిలోకి రూ.24లు

**రైతులు అందరూ పంట ఒకేసారి కోయకుండా విడతల వారీగా కోయాలి**

**జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** నేటి నుండి జూలై 3వ తేదీ వరకు తోతాపురి మామిడి గిట్టుబాటు ధర కిలోకి రూ.24 కు తగ్గకుండా ఉంటుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం జిల్లా సచివాలయం లోని సమావేశ మందిరంలో తోతాపురి మామిడి ధరల నియంత్రణపై రైతులతోపండ్ల గుజ్జు పరిశ్రమల యజమానులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో తోతాపురి మామిడికి గతంలో రూ.30 గిట్టుబాటు ధర నిర్ణయించడం జరిగిందని, ఈ విషయంలో ఎదురైన సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు



చేపట్టడంలో భాగంగా రైతులు పండ్ల గుజ్జు పరిశ్రమ యజమానులతో సంయుక్తంగా సమావేశం నిర్వహించి అందరి అభిప్రాయాలను తీసుకున్న అనంతరం అందర్నీ ఒప్పించి జూలై 1వ తేదీ నుండి జూలై 3వ తేదీ వరకు మామిడి గిట్టుబాటు ధర కిలోకి రూ.24కు తగ్గకుండా ఉండేలా నిర్ణయించడం జరిగిందని దీన్ని అందరూ పండ్ల గుజ్జు పరిశ్రమల యజమానులు అమలు చేయడం జరుగుతుందన్నారు. జూలై 3వ తేదీ వరకు అనగా బుధవారం వరకు ఈ ధర అమలులో ఉంటుందని, బుధవారం సాయంత్రం మరొకసారి రైతులు పండ్ల గుజ్జు పరిశ్రమ యజమానులతో సంయుక్త సమావేశం నిర్వహించడం జరుగు తుందన్నారు.రైతులు వారి పంటను నేరుగా పండ్ల గుజ్జు పరిశ్రమల వద్దకు తీసుకొని వెళ్లాలన్నారు.పంట అంతా ఒకేసారి కోయకుండా విడతల వారీగా పంటను కోయాలని రైతులకు కలెక్టర్ సూచించారు. ఈవిషయంలో రైతులు, పండ్ల గుజ్జు పరిశ్రమల యజమానులు సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, పండ్ల గుజ్జు పరిశ్రమల యజమానులు రాఘవా చాట్లీ, మంజునాథ్, బాబి,జైన్ షమీర్, సోము, రైతు నాయకులు నాగేశ్వరరావు, వేణు, శ్రీనివాసరెడ్డి, లవ కుమార్ రెడ్డి, వెంకట్ రెడ్డి రాజేంద్ర నాయుడు, ఉమా చంద్రారెడ్డి, జయ చంద్రా చౌదరి తదితరులు పాల్గొన్నారు

# పరిశుద్ధమైన తాగు నీటిని అందించటమే ప్రభుత్వ లక్ష్యం



**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** పరిశుద్ధమైన తాగునీటిని అందించటమే ప్రభుత్వ లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ముందుకు సాగుతున్నట్లు చంద్రగిరి యంయల్ఏ పులివర్తి నాని అన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలోని చిన్నగొట్టిగల్లు మండల కేంద్రంలో ఆదివారం వాటర్ ప్లంట్ ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న యంయల్ఏకి ఉమ్మడి కార్యకర్తలు మేళతాళాలతో స్వగతం పలికి శాలువా కప్పి, గజమాలతో సత్కరించారు. వేదపండితులు వేద మంత్రాలు వల్లిస్తరీ పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. జై నాని జై జై నాని అంటూ నినాదాలు చేశారు. యంయల్ఏ పులివర్తి నాని రిబ్బన్ కత్తరించి కొలాయి తిప్పి నీటిని సరఫరా చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వ ప్రాణులకు నీరు జీవనాధాంమని చెప్పారు. కలుషితమైన నీటిని తాగి ఎంతోమంది అనారోగ్యం పాలవుతున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఒక్కొక్కటిగా అమలపరుస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నదని అన్నారు. ప్రతి గ్రామంలో రక్షిత మంచినీటి పథకాలను ఆధునిక సాంకేతికతో ఏర్పటు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉమ్మడి కూటమి నాయకులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన చిత్తూరు ఎమ్మెల్యే గురజాల



**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను ఆదివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో చిత్తూరు శాసనసభ సభ్యులు గురజాల జగన్‌మోహన్ కలిశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం పలు కీలక అంశాలు గూర్చి చర్చించుకోవడం జరిగిందని, జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## ముఖ్యమంత్రి చొరవతో

# నూతన హంగులతో ఎన్టీఆర్ స్టేడియం

**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి క్రీడాకారుల భవిష్యత్తుకు బాటలు వేయుటకు కుప్పం నియోజకవర్గ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో కుప్పంలో ఎన్టీఆర్ స్టేడియాన్ని నిర్మించి ఎంతో అభివృద్ధి చేశారు. అలాంటి క్రీడా మైదానాన్ని గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోకపోగా స్టేడియం పూర్తిగా క్రీడాకారులకు దూరమైంది. ఎంతోమంది ఆశలను అడియాసలు చేస్తూ ఆ క్రీడా మైదానం గత ఐదు సంవత్సరాలుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. అలాంటి దశలో తిరిగి తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టగా



తన కుప్పం నియో జకవర్గం ఎందులోనూ వెనక పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరిగి తన నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఉద్దేశంతో ఎన్టీఆర్ స్టేడియాన్ని నూతన హంగులతో క్రీడాకారులకు అందుబాటులో తేవాలని ఉద్దేశంతో క్రీడా మైదానం అభివృద్ధిని నియోజకవర్గ నాయకులకు, అధికారులకు అప్పచెప్పారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం నాడు ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధి కొరకు కమిటీ ఏర్పాటు చేసి క్రీడాకారులకు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం తరపు నుండి వ్యాయామ ఉపాధ్యాయులను, కోచ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ మహేష్ మాట్లాడుతూ కుప్పంలో క్రీడలను ప్రోత్సహించే విధంగా మన ముఖ్యమంత్రి ఎంతో గొప్ప ఆలోచన చేసి ఈ స్టేడియం నిర్మించడం జరిగిందని అటువంటి దాన్ని మనం కాపాడుకొని దాని ద్వారా ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆయన తెలిపారు. అదేవిధంగా ఇకపై స్టేడియంకు పీడీగా శేఖర్, స్పోర్ట్స్ కోచ్‌గా లెనిన్ ను నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్, కన్నన్, అప్పు, కౌన్సిలర్లు సోము, జిమ్ దాము, జాకీర్ పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ పేద రైతులకు ప్లాస్టిక్ పట్టలు, డ్రమ్ములు పంపిణీ

**ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం.. ఆరోగ్యాన్ని రక్షించుకుందాం...**

**రసాయనిక ఎరువుల వాడకం ఆరోగ్యానికి హానికరం...**

**ఎమ్మెల్యే పులివర్తి నాని**

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ పేద రైతులకు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి దాని ద్వారా ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని సంరక్షించుకుందామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న ఎస్సీ, ఎస్టీల పేద రైతులకు ప్లాస్టిక్ పట్టలు, డ్రమ్ములు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకృతి వ్యవసాయంను ప్రోత్సహించటమే లక్ష్యంగా పలు పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రసాయనిక ఎరువుల వాడకం వలన ఆరోగ్యానికి హానికరం కలుగుతుండటంతో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా లభ్యమయ్యే ఆకులు, అలుములు పశువుల మూత్రం, పేడ,పుల్లటి మజ్జిగ, బెల్లం, మిరపకాయలు వంటి వాటితో ఘన, ద్రవ బీజామృత, జీవామృతాలను, కషాయాలను పెద్ద మొత్తంలో తయారు చేయడానికి డ్రమ్ములను ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. పండించే పంటలను నాణ్యతగా నూర్పిడి చేసుకోవడానికి ప్లాస్టిక్ పట్టలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే కూరగాయలకు గాని, ధాన్యాలకు గానీ మంచి డిమాండ్ ఉన్నట్లు చెప్పారు.వీటి ద్వారా అధిక ధరలు కూడా పొందవచ్చు అన్నారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకం నుంచి ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి అవసరమయ్యే సహాయ సహకారాలు అందించటానికి అన్ని విధాల చర్యలు తీసుకుంటుంది అని అన్నారు.



జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

## టీడీపీ నేత ఈశ్వర రెడ్డిని పరామర్శించిన బొజ్జల రిషిత రెడ్డి



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** మండలంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఈశ్వర్ రెడ్డిని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏంపేడు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్స్ డే



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** డాక్టర్స్ డే దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకాళహస్తి ఎస్ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు, శ్రీకాళహస్తి ఏరియా పరిధి ప్రభుత్వ ఆసుపత్రిలలో పనిచేసే ప్రభుత్వ డాక్టర్లను సత్కరించి మెమొంటోలను అందజేశారు. ఎస్ సంస్థ అద్యక్షులు మాట్లాడుతు కనిపించని ఆరాధించే దేవుడు మనకు జన్మనిస్తే, మన కళ్ళ ముందు కనిపించే వైద్యుడు అనుక్షణం మన ఆరోగ్యాలు కాపాడుతూ ఎన్నో పునర్జన్మలు ప్రసాదిస్తున్నాడని అన్నారు. హాస్పిటల్లోని వైద్యులు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. డాక్టర్ జయ గోపాల్ మాట్లాడుతూ పేషంట్ల సేవ కోసం, వారి వ్యాధి బాధలను తగ్గించడం కోసం, రోగుల ప్రాణాలను కాపాడి వారి జీవితాలు నిలబెట్టడం కోసం డాక్టర్లు తమ జీవితాలను అంకితం చేస్తారని అన్నారు.వైద్య రంగంలో గొప్ప సేవలు అందించిన అటువంటి వైద్యులను స్మరించుకోవడమే నిజమైన డాక్టర్స్ డే అని అన్నారు. డాక్టర్స్ డే పురస్కరించుకొని తమను సత్కరించిన ఎస్ సంస్థ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వివేక్ చైతన్య, డాక్టర్ జై గోపాల్, డాక్టర్ స్రవంతి, డాక్టర్ శరత్ కృష్ణ, డాక్టర్ రాహుల్ రాజ్, డాక్టర్ రూపేష్, డాక్టర్ దుర్గాప్రసాద్, యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ అధ్యక్షులు హేమ కుమార్, సభ్యులు నారాయణ, శ్రీనివాసులు, ప్రదీప్ కుమార్, కాంగ్రెస్, భక్తవత్సలం, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన దుర్యోధన వద



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** చవట గుంట మహాభారతం ఉత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు దుర్యోధన వద కార్యక్రమం పలువురిని అలరింపజేసింది. దుర్యోధన వద కార్యక్రమానికి ఉభయదారులుగా పోటు గారి గంగయ్య వ్యవహరించారు. దుర్యోధనుని మట్టి ప్రతిమను అందంగా తీర్చిదిద్దారు. గంగమడుగులో దాగివున్న దుర్యోధనుని భీముడు లాక్కుని వస్తున్న ఘట్టం పలువురిని అలరింపజేసింది. గంగ మడుగు నుండి దుర్యోధనుని భీముడు లాక్కుని వచ్చి దుర్యోధనుని ప్రతిమ వద్ద నిలబెట్టాడు. యుద్ధం సన్నివేశాలను పాటలు, పద్యాల రూపంలో ఆలపించారు. చివరకు యుద్ధ సన్నివేశంలో దుర్యోధనున్ని భీముడు వధించిన ఘట్టం చూసి పలువురు పులకరించిపోయారు. దుర్యోధనుని మట్టి ప్రతిమను తీసుకోవడానికి పలువురు పోటీలు పడ్డారు. మట్టి ప్రతిమను ఇళ్లల్లో దాచుకుంటే అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని నమ్మకంతో భక్తులు తీసుకుని వెళ్లారు. అనంతరం ధర్మరాజుల పట్టాభిషేకాన్ని హరికథ రూపంలో భక్తులకు వినిపించారు. సాయంత్రం భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి తమ భక్తిని చాటుకున్నారు.

## ఆలయానికి హార్మోనియం వితరణ


దాతలకు ఆలయ మర్యాదలు చేస్తున్న ధర్మకర్త

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** చవట గుంట శ్రీకృష్ణ ద్రౌపతి ధర్మరాజుల ఆలయాలనికి కీర్తిశేషులు దామోదర శెట్టి కుమారులు రమేష్, సీనియర్ జర్నలిస్ట్ రవి 22000 వేలు రూపాయలు విలువగల హార్మోనియం, డోలాకులను వితరణ చేశారు. వితరణ చేసిన వారిని ఆలయ ధర్మకర్త వేట రాధాకృష్ణారెడ్డి ఆలయం తరపున తాంబూలాలు ఇచ్చి మర్యాదలు చేశారు.

## ఆకట్టుకున్న దుర్యోధన వధ ఘట్టం



**పెనుమూరు మేజర్‌న్యూస్:** పెనుమూరులోని ముత్యాలమ్మ గుడిలో మహాభారత యజ్ఞం సందర్భంగా దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఆదివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం వెంకటేశ్వర నాట్య మండలి కళాకారులుచే దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. ఆలయం ఆవరణలో బంకమట్టితో దుర్యోధనుడి బొమ్మను రూపొందించి పూజలు జరిపారు. దుర్యోధన నివేషధారణలో ఉన్న వెంకటరమణ, భీముడు వేషధారణలో ఉన్న దొరస్వామి లు నాటకాని రక్తకటించారు. దుర్యోధనుడిని భీమసేనుడు మడుగు నుంచి బయటకు రప్పించే సన్నివేశం ఆకట్టుకుంది. దుర్యోధనుడు, భీమసేనుల మధ్య యుద్ధసన్నివేశాలు, పద్యాలు అలరించాయి. భీమసేనుడు ధుర్యోధనుడిని తొడపై గధతో కొట్టి వధించి రక్తాన్ని ద్రౌపదిదేవి కురులకు పూసే సన్నివేశాలు పాత్రధారులు జీవంపోశారు. ఈ ఘట్టాన్ని చూసేందుకు పెనుమూరు మండలం నల్లమూల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.దుర్యోధన వధ అనంతరం భక్తులు బంక మట్టితో ఏర్పాటు చేసిన దుర్యోధనుని ప్రతిమను భక్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిష్టాత్మకంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ



**పలమనేరు మేజర్‌న్యూస్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జూలై 1 వ తారీఖున చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పంపిణీ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సూచించారు. ఆ మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో పింఛన్ల పంపిణీ పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలో పంపిణి చేయనున్న పింఛన్ల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. జూలై నెలలో 4682 మంది లబ్ధిదారులకు సుమారు 3.20 కోట్ల రూపాయలను పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఆయనకు వివరించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికలకు ముందు పెన్షన్ల పెంపు చేపడుతామని ఇచ్చిన హామీ మేరకు రూ. 3 వేలను 4వేలకు, దివ్యాంగులకు రూ. 6 వేలుగా పెంచి అందించడంతో పాటు, హామీ ఇచ్చిన నాటి నుంచి అనగా గడిచిన మూడు నెలలకు సంబందించిన మిగులు పెన్షన్ తో కలిపి రూ. 7 వేలను అందించడం గొప్ప విషయమన్నారు. కాబట్టి ఒకటో తారీఖున ఉదయానికల్లా సకాలంలో లబ్ధిదారులకు సచివాలయ అధికారుల ద్వారా ఇంటింటికి వెళ్ళి పెన్షన్ సొమ్ము అందించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ రమణారెడ్డికి ఆయన సూచించారు. పట్టణంలోని 26 వార్డులలో ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఆయన కోరారు. పెన్షన్ల కోసం లబ్ధిదారులెవరు సచివాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదని వారి వారి ఇళ్ల వద్దకే పెన్షన్లు సకాలంలో అందుతాయని కాబట్టి లబ్ధిదారులు ఈ విషయాన్ని గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో పాటు టిడిపి నాయకులు ఆర్.వి బాలాజీ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చాంద్ భాష, ఖాజాపీర్, మాభాషా, దీపికా కృష్ణమూర్తి, బిఆర్‌సి కుమార్, కిరణ్, గిరి,నాగరాజా, కుట్టి, సుబ్రహ్మణ్యం గౌడు, సుబ్బ నాగయ్య, మదన్, కోటి, శ్రీధర్, సోమన్న, మురళీకృష్ణ, మండల నాయకులు జగదీష్ నాయుడు పాల్గొన్నారు.

## నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

**- నీటి పరీక్ష రద్దుకై 4న విద్యాసంస్థల బంద్**
**-ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేస్ రంగరాజ్**

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** నూతన జాతీయ విద్యా విధానం ఎన్ఐపీ 2000ను రద్దు చేస్తూ అన్ని రాష్ట్రాల అసెంబ్లీలో చీర్యానా ప్రవేశపెట్టాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి డినేస్ శ్రీరంగరాజ్ డిమాంక్ చేశారు. ఎంఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాల ముగింపు సందర్భంగా గంధమనేని శివయ్య భవన్లో ఏర్పాటు చేసిన మిరియా సమావేశంలో ఆయన మాట్లాడారు, రెండు రోజుల పాటు జరిగిన ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి దేశ వ్యాప్తంగా విద్యారంగంలో వస్తున్న మార్పులు, సమస్యలపై చర్చించి తీర్మానం చేయడం జరిగిందన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీటద్ పరీక్షా ఫలితాలీ పేపర్ లికేజితో 24 లక్షల మంది విద్యార్థుల భవిషత్ అంధకారంగా మారిందన్నారు. పరీక్ష పేపర్ లీకేజీలపై పార్లమెంట్లో చర్చ చేయడానికి బిజేపీ ప్రభుత్వం అనుమతించకపోవడం దుర్మార్గమన్నారు. పరీక్ష పేపర్లు వరుస లీకేజీలవుతున్నా ఎందుకు ఎన్టీఏని ప్రజ్ఞాశన చేయలేదని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలు రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కోరుతూ దేశ వ్యాప్తంగా ఈనెల 4వ తేదీన కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తామన్నారు. వామపక్ష ప్రగతిశీల విద్యార్థి సంఘాలు ఉమ్మడిగా సంపూర్ణ మద్దతు తెలియజేశాయన్నారు. యూనివర్శిటీలలో రాజకీయ పార్టీ కార్యకర్తలు లాగా పని చేస్తున్నారని. యూనివర్శిటీల పరిరక్షణకై సేవ్ యూనివర్శిటీ సేవ్ డెమోక్రసీ పేరుతో ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు.. నీట్టు చేయాలని తమిళనాడు అసెంబ్లీ తరహాలో అన్ని రాష్ట్రాల అసెంకాలానికి తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ జాతీయ సమావేశాల్లో నూతన జాతీయ అధ్యక్షుడిగా మహారాష్ట్రకు చెందిన విరాజ్ దేవాంగ్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి కార్యదర్శి కె.శివారెడ్డి, సంఘమిత్ర కబీర్, అమీన్, మహేష్ కుంజం, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి పాల్గొన్నారు.




## డిపోకు పూర్వ వైభవం తీసుకురావాలి : ఎమ్మెల్యే

**- తరలిపోయిన సర్వీసులు తిరిగి తెచ్చుకుందాం**



**పలమనేరు మేజర్‌న్యూస్ :**పలమనేరు ఆర్టీసీ డిపోకు పూర్వ వైభవం తీసుకురావాలని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం పలమనేరు ఆర్టీసీ డిపో మేనేజర్ స్వామితో పాటు అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన డిపో పరిధిలో నడుస్తున్న సర్వీస్ వివరాలను పూర్తిగా అడిగి తెలుసుకున్నారు. ఏపి సర్వీస్ లు రద్దు చేశారు. ఎన్ని సర్వీసులు అవసరముందని ఆరా తీశారు. ఎక్స్ప్రెస్ సర్వీస్ లను పెంచాలని ఇక్కడి నుంచి తరలించిన సర్వీస్ లను తిరిగి తెప్పించుకొనేలా వెంటనే అధికారులు చొరవ చూపాలన్నారు. జిల్లాకే తలమానికంగా నిలిచిన పలమనేరు డిపో నిర్వీర్యం కావడం పై ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. మంచి ఆదాయం ఉన్న ఇక్కడి డిపో నుంచి అధికంగా సర్వీసులు ఇతర నియోజకవర్గలకు తరలించడానికి గల కారణాలను తెలుసుకున్నారు. కుప్పం నుంచి పలమనేరుకు వచ్చిన సర్వీసులు అక్కడికే రిటర్న్ అయ్యాయని అయితే పుంగనూరుకు తరలించిన ఇక్కడి సర్వీసులు తిరిగి రాలేదని అధికారులు ఆయనకు వివరించారు. మరోవైపు ఆటోల కారణంగా ఆదాయానికి గండి పడ్డం కూడా పలు సర్వీసులు నిలిపివేయడానికి కారణం అని పేర్కొన్నారు. ఏదేమైనా పలమనేరు ఆర్టీసీ డిపోకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని అయితే అధికారుల పరంగా తీసుకోవాల్సిన చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు.

## నాణ్యమైన విద్యను అందించడమే స్కెప్సా లక్ష్యం

శ్రీకాళహస్తి మేజర్ న్యూస్: పట్టణంలో ప్రైవేట్ స్కూళ్ళలోని విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యం అని ఆదివారం ఆక్స్ఫర్డ్ స్కూల్లో జరిగిన శ్రీకాళ హస్తి ఇంగ్లీష్ మీడియం ప్రవేట్ స్కూల్స్ అసో సియేషన్ అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన రెడ్డి అన్నారు. మొదటి జనరల్ బాడీ మీటింగ్‌లో తీర్మానించిన విధంగా మన స్కెప్సా సభ్యులు ప్రభుత్వోద్యోగులు రిటైర్ అయిన భవాని స్కూల్ కరస్పాండెంట్ చిలకా రంగయ్యకు స్కెప్సా తరపున ఘనంగా సన్మానించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్లో విద్యను అభ్యసి స్తున్న విద్యార్థులకు మంచి విద్యతో పాటు, భవిష్యత్తు కు ఉపయోగ కరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతర ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి కొన్ని నిర్ణయాలు తీసుకోవలసిన ఆవశ్యకతపై చర్చించారు. కార్యక్రమంలో స్కెప్సా అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదనరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌లు కాయం సుబ్బరామరెడ్డి, ఢిల్లీ బాబు, సెక్రెటరీ చంద్రశేఖర్, ట్రెజరర్ నెల్లూరు విద్యాసాగర్, సభ్యులు అందరూ పాల్గొన్నారు.



# అర్థం లేని విమర్శలు చెవిరెడ్డివి : మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్:** చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గెలిచిన వెంటనే నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని మాట్లాడడం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాటలు అర్థం లేని విమర్శలని తెలుగుదేశం పార్టీ రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి కొట్టి పరేశారు. ఆదివారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేనట్టుగా ప్రతిపక్ష పార్టీల బ్యానర్లు ఉండకూడదు అనే దురుద్దేశంతో చంద్రగిరి నియోజకవర్గంలో బ్యానర్లను బ్యాన్ చేయించారన్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలకు ఆయన పేరును ఖరీదైన మెటీరియల్ తో ఎలా వేయించుకుంటారని ప్రశ్నించారు. గడిచిన ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ హాయంలో 520 జీవో ప్రకారం ఎక్కడ గాని ప్రోటోకాల్ విధానాన్ని పాటించలేదన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎక్కడ గాని శిలాఫలకాలను తమ పార్టీకి చెందినవారు ధ్వంసం చేయలేదన్నారు. కానీ గ్రామాల్లో వైసీపీ సానుభూతిపరులను రెచ్చగొట్టి హింసను ప్రేరేపితం చేయడానికి కుట్ర పన్నుతున్నారని, గతంలో అధికారులను తన సొంతానికి వాడుకుని ఈరోజు అదే అధికారులపై న్యాయపోరాటం చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తుడా నిధులను ఇష్టానుసారంగా దుర్వినియోగం చేశారని, రూ.3 వేలు రూపాయలు విలువచేసే బెంచీలను రూ.10 వేల రూపాయలుగా లెక్కలు చూపి అక్రమంగా దోచుకున్నారన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో పులివర్తి నాని గెలుపొందడానికి చెవిరెడ్డిపై అసహనంతో ఉన్న వైసీపీ క్యాడర్ పులివర్తి



నాని గెలుపు కోసం పని చేసిందన్నారు. పోలింగ్ అనంతరం శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ వద్ద పులివర్తి నానిపై జరిగిన దాడిలో పాల్గొన్నవారికి తిరుపతి విక్టరీ బార్లు మద్యం బిల్లు కట్టింది చెవిరెడ్డి తమ్ముడు కాదా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రూ.5వేల కోట్ల రూపాయలు సంపాదించాడని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ సహాయంతో చిరునామాలను ప్రజలు కనుక్కుంటున్నారని, చంద్రగిరి నియోజకవర్గంలో మూడు కోట్ల 70 లక్షల రూపాయలతో వైయస్సార్ మార్గ్ అని బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల గూగుల్ కి కూడా చిరునామాలు చూపడానికి అంతు పట్టడం లేనివిధంగా చేసేసారన్నారు. నిజమైన అభివృద్ధి ఏంటో ఎమ్మెల్యే పులివర్తి నాని చంద్రగిరి ప్రజలకు చూపబోతున్నారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టిడిపి తిరుపతి రూరల్ మండల కార్యదర్శి గోపీనాథ్, టిడిపి నాయకులు బడి సుధాయాదవ్, కొల్లూరి ఈశ్వరయ్య, కురకాల్వ సుధాకర్, దొడ్ల కరుణాకర్ రెడ్డి, కత్తి సుధాకర్, జనసేన నాయకులు నీలాద్రి పాల్గొన్నారు.

# వైయస్సార్ ప్రభుత్వంలో బీసీ భవనం స్థలం నిరుపయోగం

**పలమనేరు మేజర్న్యూస్ :** పలమనేరు నియోజకవర్గ శాసనసభ్యులు ఎన్ అమర్నాథరెడ్డికి ఆదివారం ఉదయం నియోజకవర్గ బీసీ ఫ్రంట్ అధ్యక్షులు పూలే గోవిందస్వామి వినత పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 12-8- 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం బీసీ భవనమునకు 473 /3లో 15 సెంట్లు స్థలమును కేటాయించిందన్నారు. 2019 సంవత్సరంలో వైయస్సార్ ప్రభుత్వం ఆ స్థలమును నిరుపయోగంగా చేసిందన్నారు. 2024సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లోటిడిపి ప్రభుత్వంలో మరల పలమనేరు ఎమ్మెల్యేగా ఎన్ అమర్నాథరెడ్డి గెలుపొందారు. అందులో భాగంగానేబీసీ భవనానికి రూ. 50 లక్షలు నిధులు కూడా వెచ్చించారన్నారు. మరలా ఆ కార్యక్రమాన్ని మీ చేతులారా జరగాలని కోరుకుంటున్నామన్నారు. బిసి మీటింగ్ లకు సమావేశాలకు బీసీ భవనంలో ఏర్పాటు చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నంజుండప్ప తో పాటు బీసీ నాయకులు పాల్గొన్నారు.



# భక్త జనసంద్రంగా బోయకొండ

**చౌడేపల్లి మేజర్న్యూస్:** మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన బోయకొండ గంగమ్మ నుదర్శించుకోవడానికి ఆంధ్ర కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో ఉదయం 6 గంటలకు బారులు తీరారు వర్షం సైతం లెక్కచేయకుండా అమ్మవారిని దర్శించుకోవడానికి మొక్కులు తీర్చుకోవడానికి ముడుపులతో క్యూలైన్లను మహిళలు అధిక సంఖ్యలో వచ్చారు ఆదివారం సెలవు రోజు కావడం అయినందువల్ల స్కూల్ విద్యార్థులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్న ప్రధాన అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు భక్తులకు ఏ ఇబ్బంది కలగకుండా ఆలయ ఈవో చంద్రమౌళి త్రాగునీరు తీర్థప్రసాదాలు అందరికీ అందేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పెదబోగము చిన్న బోగము సమర్పించే ప్రదేశాన్ని కార్యనిర్వాహణ అధికారి చంద్రమౌళి సందర్శించారు. అర్చకులు గంగిరెడ్డి కృష్ణప్ప సుధాకర్ రాము రాజన్న ప్రసాద్ చిన్న గంగిరెడ్డి ఆలయ సిబ్బంది రామనాథం,వీరకుమార్, కృష్ణారెడ్డి సుధాకర్ రెడ్డి సురేందర్ రెడ్డి సూరి , తాతయ్య పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యకి ఆత్మహత్య

**పెద్దపంజాణి, మేజర్న్యూస్:** మండలంలో కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. పెద్దపంజాణి పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని భద్రాచలం గ్రామనివాసి రజాక్ సాబ్ కుమారుడు ఇమ్రాన్ మద్యానికి బానిసై ఆదివారం భద్రాచలం గ్రామ సమీపంలోని చెట్టుకి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పాత సామాన్లు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించే ఇమ్రాన్కి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రతిరోజూ మద్యం తాగి భార్యతో గొడవపడేవాడని, భార్య మందలించడంతో మద్యం మత్తులో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు . ఈ మేరకు పెద్దపంజాణి పోలీసులు కేసు నమోదు చేసుకుని శవాన్ని పరీక్ష నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

